
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శనివారం 9 నవంబరు 2024 | 5





ఊపిరి తీసిన ఉపాధి!

ఉపాధి ఊపిరి తీసింది.. నలుగురిని బలిగొంది. ఇసుక గుంతలు ఎంత ప్రమాదకరమో చెప్పకనే చెప్పింది.. అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలం బొంగరాలపాడులో ఉన్న ఏలేరు వాగులో ఇసుక తీతకు నలుగురు కూలీలు వెళ్లారు.. ఉదయం అంతా పనిచేశారు.. మధ్యాహ్నం సమయానికి మరింత లోతుకు వెళ్లారు.. అయితే నలుగురిలో ఒకరు ముందుకు వెళ్లగా ఇసుక గుంతలో పడి కొట్టుకుంటున్నాడు.. ఇది గమనించిన మరో ఇద్దరు అతన్ని కాపాడేందుకు ముందుకెళ్లారు.. ఆ ముగ్గురు లోపలకు వెళ్లిపోతుండగా మరొకరు గమనించి పట్టుకున్నారు.. ఇలా ఒకరి వెంట మరొకరు.. నలుగురు మునిగిపోయారు.. వీరిలో ముగ్గురు ఒకే కుటుంబానికి చెందిన వారు.. - వివరాలు 7లో



నీటి ఎద్దడి తీర్చకపోతే చర్యలు : చక్రద్వారబంధంలో రోడ్డుపై నిలబడి సిబ్బందితో చర్చిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఈ సీజన్‌లో నీరందించలేకపోవడం సిగ్గుచేటు!

- చక్రద్వారబంధంలో కలెక్టర్ ఆగ్రహం
- ఆంధ్రజ్యోతి కథనంతో పరుగులు

రాజానగరం,నవంబరు 8 (నవంబరు) : గ్రామస్తులందరికీ సమానంగా నీటిని సరఫరా చేసే దిశగా తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్‌డ బ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. నీళ్ల కావా లంటే..పని మానుకోవాల్సిందే! శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన కథనంపై కలెక్టర్ పి.ప్రశాంతి తక్షణమే స్పందించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకే కలెక్టర్ పి.ప్రశాంతి రాజానగరం మండలం చక్రద్వారబంధం గ్రామానికి చేరుకుని ఆకస్మికంగా సందర్శించారు.అధికారులు అందుబాటులో లేకపోవడంతో స్థానిక బోరు ఆపరేటర్‌తో మాట్లాడారు. ఈ సీజన్‌లో కూడా నీరందించలేకపోవడం సిగ్గుచేటని, ఎందుకు ఇవ్వడం లేదని బోర్‌వెల్ ఆపరేటర్ చక్రవర్తిని ప్రశ్నించారు.స్థానికుడు ముత్యం హరేరామకృష్ణ కలెక్టర్‌కు నీటి ఇబ్బందులను వివరించాడు. గ్రామంలో అనధికారిక కుళాయిలు అధికంగా ఉన్నాయని, మరికొన్ని కుళాయిలు నుంచి నీరు వృథాగా పోతున్నా పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదని తెలిపారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో అనధికారిక కుళాయిలను తొలగించాలని ఆపరేటర్‌ను ఆదేశించారు. హుటాహుటిన ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు బి.శ్రీనివాస్, టి.శ్రీనివాసబాబు, ఏఈ అవినాష్‌లు కలెక్టర్ వద్దకు చేరుకున్నారు. గ్రామంలో ఉన్న మూడు వాటర్ ట్యాంకులను అనుసంధానం చేస్తూ, వాల్వులు ఏర్పాటు చేసి గ్రామస్తులందరికీ సమానంగా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. చక్రద్వారబంధంలో ప్రజాసమస్యలపై వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి స్థానిక హరేరామకృష్ణ ఫోన్ నంబర్‌ను, కలెక్టర్‌తో అనుసంధానం చేయాలని అధికారులకు సూచించారు. ఏసమస్య ఉన్నా అధికారుల దృష్టికి తీసుకెళ్లమన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామంలో నిల్వ మాంసం విక్రయాలు సాగుతున్నా యని చెప్పడంతో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ని ఫోన్‌లో సంప్రదించి చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ లక్ష్మీ లావణ్యకు సూచించారు.పంచాయతీ కార్యదర్శి సత్యవాణి అందుబాటులో లేకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు కస్తూర్బాగాంధీ ఆశ్రమ శత వార్షికోత్సవం

సీతానగరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సీతానగరం కస్తూర్బాగాంధీ శతవార్షికోత్సవాలు శనివారం నుంచి ప్రారంభిస్తున్నట్టు ఆశ్రమ ప్రతినిధి సుశీల శుక్రవారం తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా గాంధీ ఆశయ సాధనకు 9 నవంబర్ 1924న బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం ఈ ఆశ్రమాన్ని స్థాపించారన్నారు. గాంధీజి రెండుసార్లు ఈ ఆశ్రమాన్ని సందర్శించారన్నారు. ఆశ్రమం స్థాపించి శనివారానికి 100 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శత వార్షికోత్సవ వేడుకల స్థూపం (జ్ఞాపిక) ఆవిష్కరణ,దక్షిణ సబర్మతి-గౌతమి సత్యాగ్రహ ఆశ్రమం అనునామకరణంతో గ్రంధావిష్కరణ,ఆశ్రమ నివాసుల విగ్రహాల ఆవిష్కరణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

రాజమహేంద్రవరం ఎస్‌బీ డీఎస్పీగా రామకృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఎస్‌బి డీఎస్పీగా బి.రామకృష్ణను నియమిస్తూ రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇందులో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం ఎస్‌డీపీవోగా విధులు నిర్వహిస్తున్న బి.రామకృష్ణను తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా బదిలీపై నియమించారు.

పవన్ దీక్షపై అనుచిత పోస్టింగ్ వన్‌టౌన్‌లో కేసు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 8,(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక సోషల్ మీడియా కేసు నమోదు చేశారు. జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఇటీవల తిరుపతి లడ్డూ కల్తీ విషయంలో చేపట్టిన దీక్షపై ప్రకాష్‌నగర్‌కు చెందిన కేబీఆర్ రాజుసోషల్ మీడియాలో అనుచితంగా పోస్టింగ్ పెట్టాడని, అలాగే కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలపై తప్పుగా ప్రజలకు ప్రచారం చేస్తూ సోషల్ మీడియాలో రీల్స్ పెట్టారని రాజమహేంద్రవరం 8వ డివిజన్ జనసేన ఇన్‌చార్జి అచ్చిరెడ్డి వీరనాగేంద్రప్రసాద్ వన్ టౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

14 ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణాలకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. 14 రోడ్లు 101 కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లు సంసిద్ధత వ్యక్తం చేశారు. దీనిలో జి.వేమవరం- గొర్రి పూడి రోడ్డు, కరప-ఇంద్రపాలెం- దోమాడరోడ్డు, గొల్లపాలెం-కుయ్యేరు రోడ్డు, మురమళ్ల-వెదుర్లంక- పోలవరం రోడ్డు, ముమ్మిడివరం -కాట్రేనికోనరోడ్డు, ముమ్మిడివరం-ముక్తేశ్వరంరోడ్డు, విశ్వేశ్వరాయపురం- దిండిరోడ్డు, చింతలపూడి బ్రిడ్జి- మల్కిపురం రోడ్డు, రాజమహేంద్రవరం - గోకవరం-ముగ్గళ్లరోడ్డు, రాజానగరం- వెస్ట్ గోనగూడెం రోడ్డు, రాపాడు- చిన కొండేపూడి రోడ్డు, రేపాక- చిన కొండేపూడి రోడ్డు, రాజుపాలెం- రామవరం రోడ్డు,ఏలేశ్వరం-జడ్డంగి రోడ్లు ఉన్నాయి. వీటిని నిర్మాణాలు జరగనున్నాయి. అమరావతిలో గురువారం జరిగిన ఉన్నతాధికారుల సమావేశంలో ప్రభుత్వ హామీతో కాంట్రాక్టర్లు ముందుకు వచ్చారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 14 రోడ్ల నిర్మాణాలు పనులు ప్రారంభం అవుతున్నాయని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ జి.కంఠు తెలిపారు. రూ.290 కోట్ల నిధులు కేటాయించగా 30 శాతం రాష్ట్రప్రభుత్వం వాటా,70 శాతం న్యూడెవలప్‌మెంట్ బ్యాంకు ప్రాజెక్టు నుంచి సమకూరింది.



తేల్చుకుందాం!

రచ్చకెక్కిన జిల్లా ఆడిట్ శాఖ

జిల్లా ఆడిట్ శాఖలో మామూళ్ల వివాదం రచ్చకెక్కింది.. అసలు ఏం జరిగిందో ఏమో కానీ.. ఆ శాఖ జిల్లా ఇన్‌చార్జి ఆడిట్ అధికారికి.. మిగిలిన ఉద్యోగుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా ఉంది. ఇదిలా ఉండగా 2021-22లో ఆడిట్ జరిగిన 90 పంచాయతీల రికార్డులను మళ్లీ ఆడిట్ చేయాలని జిల్లా ఆడిట్ అధికారిని కలెక్టర్‌కు లేఖ రాయడంతో అసలు వివాదం బయటపడింది. అసలు ఏం జరిగిందనే దానిపై రకరకాల వాదనలు వినిపిస్తున్నాయి. దీనిపై రాష్ట్ర ఆడిట్ డైరెక్టర్ విచారణకు ఆదేశించారు.

- లెక్కల్లో తేడాలు
- ఉద్యోగుల మధ్య వివాదం
- ఆధిపత్యపోరుతో సతమతం
- మామూళ్లే కారణమా?
- జిల్లా అధికారిణిపై తిరుగుబాటు
- కలెక్టర్‌కు ఆడిట్ అధికారి లేఖ
- 90 పంచాయతీల్లో రీఆడిట్
- కుదరదంటున్న పాలకవర్గాలు
- గ్రామాల్లో గందరగోళం
- 12న జేడీ ఎంక్వయిరీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లా ఆడిట్ ఆఫీసులో ఆధిపత్య పోరుతో గందరగోళం ఏర్పడింది.జిల్లా ఆడిట్ అధికారి తమను వేధిస్తున్నారని మిగతా ఉద్యోగులంతా ఆమెపై తిరుగుబాటు చేశారు. 2023 మే నుంచి ఒకరింటే ఒకరికి పడని పరిస్థితి ఉండడంతో ఆడిట్ పనులు నిలిచిపోయాయి.ఈ నేపథ్యంలో పాత ఆడిట్ రిపోర్టులను తిరగదోడే పరిస్థితికి వచ్చారు. దీంతో పలు వర్గాల్లో ఆందోళన నెలకొంది.

గతంలో బదిలీ చేసినా ఇక్కడే..

2022లో జిల్లాల విభజన తర్వాత రాజమహేంద్రవరం కేంద్రంగా జిల్లా ఆడిట్ కార్యాలయం ఏర్పడింది. అయితే జిల్లా ఆడిట్ అధికారి నియామకం జరగలేదు.జిల్లా ఇన్‌చార్జి ఆడిట్ అధికారిగా ఒకరిని ప్రభుత్వం నియమించింది. ఇక్కడ ఇద్దరు అసిస్టెంట్ ఆడిట్ అధికారులు (ఏఏవో)లు, 13 మంది సీనియర్ ఆడిటర్లు, ముగ్గురు జూనియర్ ఆడిటర్లు,ఇద్దరు అటెండర్లు ఉన్నారు. ఇన్‌చార్జి జిల్లా ఆడిట్ ఆఫీసర్‌గా పద్మజారాణి 2022 జూలై1న బాధ్యతలు స్వీకరించారు.2023 మేలో గుడివాడకు బదిలీ చేయగా కోర్టు నుంచి స్టే తెచ్చుకుని ఇక్కడే కొనసాగుతున్నారు.అప్పటి నుంచి ఆమెకు, సిబ్బందికి మధ్య పోరు మొదలైంది. జిల్లా ఆడిట్ కార్యాలయం పరిధిలో జిల్లాలోని 300 పంచాయతీలు, రాజమహేంద్రవరం కార్పొరేషన్, కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీలు, దేవస్థానాలు, మార్కెట్ కమిటీలు ఉంటాయి.ఆయా సంస్థల ఆదాయ వ్యయాలు ఆడిట్ చేసి డిపార్ట్‌మెంట్ డైరెక్టర్‌కు రిపోర్టు ఇవ్వాలి. ప్రతి ఏటా ఆడిట్ చేస్తారు. ఆడిట్‌కి వెళ్లిన అధికారులకు ఆయా సంస్థలు రాచమర్యాదలు చేస్తుంటాయి.రూ.లక్షల్లోనే మామూళ్లు ముట్టచెబుతుంటాయి. ఎందుకంటే అక్రమ ఆదాయాలకు సంబంధించి పక్క దారి పట్టించిన నిధులు ఉంటాయి. జిల్లా అధికారికి, ఇతర ఆడిటర్లు,ఉద్యోగుల మధ్య మామూళ్లు, తప్పులను కప్పిపుచ్చే వ్యవహారాల మధ్య సయోధ్య కుదరలేదని సమాచారం.ఈ నేపథ్యంలో జిల్లా అధికారితో పాటు,ఉద్యోగులు వేర్వేరుగా డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.ఈ నెల 12న ఆడిట్ జాయింట్ డైరెక్టర్ విచారణకు ఆదేశించారు.

చాలా కాలంగా గొడవలు..

ఆడిట్ కార్యాలయంలో చాలా గొడవలు జరిగినట్టు సమాచారం ఉంది. గొడవలు ముదరడంతో 2023 మే నెలలో జిల్లా అధికారి ఉద్యోగుల జీతాల బిల్లు పెట్టలేదు.అడిగితే అందరినీ జైలుకు పంపిస్తామని బెదిరించినట్టు కొందరి కథనం. గతేడాది జూన్‌లో ఉద్యోగులంతా అప్పటి జిల్లా ఎస్పీని కలిసి వినతి పత్రం కూడా ఇచ్చినట్టు సమాచారం.కొద్దినెలల కిందట ఏకంగా ఉద్యోగులంతా సుమారు 15 రోజులకు పైగా మూకుమ్మడి సెలవు పెట్టేసి ఆఫీసుకు రాలేదు. కేవలం జిల్లా అధికారి మాత్రమే హాజరయ్యేవారు.ఇలా వివాదం బాగా ముదరడంతో పాటు గతంలో ఆడిట్ చేసి అప్ లోడ్ చేసిన నివేదికలను తిరిగి రివ్యూ చేయాలనే ఆలోచనకు జిల్లా అధికారి రావడంతో, మరింత గందరగోళం ఏర్పడింది. ఈ నేపథ్యంలో అసలు ఇక్కడ ఏం జరుగుతుందో నిగ్గు తేల్చడానికి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.ఈ నెల 12న జాయింట్ డైరెక్టర్ స్థాయి ఆడిట్ అధికారి ఇక్కడకు విచారణ జరపనున్నారు.ఈ నేపథ్యంలో ఎవరికి వారు తమ తప్పు లేదని చెప్పుకోవడానికి ఎత్తులు వేస్తున్నారు. మంగళవారం జరిగే విచారణలో ఏం జరుగుతుందోననేది ఆసక్తిగా మారింది.దీనిలో ఆడిట్‌లో అవకతవకలు బయటకు వస్తాయని అంచనా ఉంది.

కలెక్టర్‌కు ఫిర్యాదు

2021-22లో జిల్లాలోని అన్ని పంచాయతీల్లో ఆడిట్ జరిగింది. జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో ఆదాయ వ్యయాలను పరిశీలించి ప్రస్తుత జిల్లా అధికారి పద్మజారాణి సంతకం చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు.అంటే అప్పటికి ఆమె అభ్యంతరం చెప్పవలసినవి ఏమీ లేనట్టేనని అర్థం.అయితే ఇప్పుడు మళ్లీ జిల్లా వ్యాప్తంగా 90 పంచాయతీల్లో తిరిగి ఆడిట్ చేయవలసిన అవసరం ఉందంటూ ఈ నెల 1న జిల్లా ఆడిట్ అధికారి పద్మజా రాణి స్వయంగా కలెక్టర్ పి.ప్రశాంతికి లేఖ రాశారు. తాను గ్రామ పంచాయతీలకు సం బంధించిన 2021-22 సంవత్సరానికి ఆడిట్లను రివ్యూ చేయడానికి పంచాయతీ సెక్రటరీల నుంచి రికార్డులు కోరగా చూపించలేదని అందులో వివ రించారు. అనపర్తి, బిక్కవోలు, కోలమూరు సెక్ర టరీలను పలుదఫాలు కోరినా రికార్డులు చూపించలేదన్నారు.ఈ నేపథ్యంలో ఆడిట్లు ఆగిపోయాయని తెలిపారు.ఆడిట్లు పూర్తి చేయడానికి రికార్డులన్నీ చూపాలని ఆయా సెక్రటరీలను ఆదే శించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. జిల్లా కలెక్టర్ డీపీవోకు ఫార్వర్డ్ చేయగా ఆమె జిల్లాలోని 90 పంచాయతీలకు ఫార్వర్డ్ చేశారు.


రీ ఆడిట్‌పై ఆందోళన

2021-22 ఆడిట్‌ను తిరగదోడతామని చెప్పడంతో జిల్లాలోని 90 పంచాయతీ సెక్రటరీలు, పాలకవర్గాల్లో గందరగోళం నెలకొంది. తిరిగి ఆడిట్ చేయడానికి పంచాయతీ సర్పంచ్‌లు, సెక్రటరీలు ఒప్పుకోవడంలేదు. జిల్లా అధికారి మాత్రం ఆడిట్ జరగాలని పట్టుపడుతున్నారు. నిబంధనల ప్రకారం ఒకసారే ఆడిట్ చేయాలని, పైగా ఆమోదించిన అధికారే తిరిగి ఆడిట్ చేయడం ఏంటని సర్పంచ్‌లు, కార్యదర్శులు, అధికారులు,ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు.కానీ తిరిగి ఆడిట్ చేస్తే వారికొచ్చిన సమస్య ఏంటనేది మరో ప్రశ్నగా మారింది.అప్పట్లో వైసీపీ పాలకవర్గాలు ఎక్కువగా ఉండడం వల్ల తప్పులు దాచిపెట్టి జిల్లా అధికారి, ఆడిటర్లు ఒకటై నివేదికలు ఇచ్చి ఉంటారని.. ఇవాళ వారి మధ్య వివాదం రావడంతో ఈ విషయం తిరగదోడుతున్నట్టు ప్రచారం జరుగు తోంది. ఆడిట్ ఆపడానికి కొందరు ప్రయత్నాలు చేస్తున్నట్టుసమాచారం.ఈవోపీఆర్‌డీల ద్వారా రీ ఆడిట్‌కు సిద్ధం చేయిస్తున్నట్టు తెలి సింది.



90 పంచాయతీలివే..

ఆడిట్ జరపాలని కోరిన 90 పంచాయతీలు ఇలా ఉన్నాయి.దేవరపల్లి మండలంలోని దేవరపల్లి,యర్నగూడెం, చిన్నాయిగూడెం, బంధపురం,యాదవోలు, గౌరీపట్నం, పెరవలి మండలం ఖండవల్లి,గోపాలపురం మండలం గోపాలపురం,చిట్యాల, గుడ్డిగూడెం పంచాయతీలు ఉన్నాయి. ఉండ్రాజవరం మండలం పాలంగి, పసలపూడి, సూర్యారావుపాలెం, కె.సావరం ఉన్నాయి.తాళ్లపూడి మండలం అన్నదేవరపేట, మలకలకపల్లి,తిరుగుడుమెట్ట, పెద్దేవం, వేగేశ్వరపురం,పోచవరం,నల్లజర్ల మండలం అనంతపల్లి,తెలికిచర్ల,అనుమునిలంక, చీపురుగూడెం, చోడవరం ఈస్ట్, ప్రకాశరావుపాలెం పంచాయతీలు ఉన్నాయి.నిడదవోలు మండలం శెట్టిపేట, సమిశ్రగూడెం, కోరుమామిడి, తాడిమళ్ల, రావిమెట్ల, కంసాలిపాలెం, తిమ్మరాజుపాలెం ఉన్నాయి.చాగల్లు మండలం బ్రాహ్మణ గూడెం, చిక్కాల,నందిగంపాడు, కలవలపల్లి,చాగల్లు, ధర్మవరం, ఊనగట్ల పంచాయతీలు ఉన్నాయి. రంగంపేట మండలం రంగంపేట, నల్లమిల్లి, వీరంపాలెం,సీతానగరం మండలం చిన కొండేపూడి,రఘుదేవపురం, సీతానగరం, బొబ్బిల్లంక, ముగ్గళ్ల,సింగవరం, కూనవరం ఉన్నాయి. బిక్కవోలు మండలం బిక్కవోలు, బలభద్రపురం,కొంకుదురు, అనపర్తి మండలం కుతుకులూరు,మహేంద్రవాడ, అనపర్తి, కడియం మండలం కడియం, వేమగిరి, కడియపులంక, దుళ్ల గ్రామాలున్నాయి.కోరుకొండ మండలం గాడాల, కణుపూరు, జంబూపట్నం, మధురపూడి, వెస్ట్ గోనగూడెం, రాఘవపురం, కాపవరం, గాదరాడ పంచాయతీలున్నాయి. రాజమండ్రి రూరల్‌లోని రాజవోలు,బొమ్మూరు, హుకుంపేట, కోలమూరు,ధవళేశ్వరం రాజానగరం మండలం దివాన్‌చెరువు, చక్రద్వారబంధం, వెలుగుబంద, నరేంద్రపురం, కొండగుంటూరు, శ్రీకృష్ణపట్నం, కలవచర్ల,భూపాలపట్నం నామవరం, నందరాడ, సంపత్‌నగరం,కొత్త తుంగపాడు, పాతతుంగపాడు, రాజానగరం ఉన్నాయి.



భక్తి సమ్మేళనంలో మాట్లాడుతున్న దుర్గేష్

వివేకానంద, పరమహంసల బోధనలు ఆచరణీయం

భక్తి సమ్మేళనంలో మంత్రి దుర్గేష్

నిడదవోలు,నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వివేకానందుడు, రామకృష్ణ పరమహంసల జీవన విధానాన్ని యువత ఆకళింపు చేసుకుంటే భవిష్యత్తు బంగారమవుతుందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు లయన్స్ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన రామకృష్ణ, వివేకానంద భావ ప్రచార పరిషత్ 5వ భక్తి సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. నేటి సమాజంలో కొందరు యువత గంజాయి మత్తులో నిర్వీర్యం అయిపోతున్నారని వారి భవిష్యత్ నాశనం చేసుకుం టున్నారన్నారు. కాలాలు మారినా తరాలు మారినా వివేకానందుడి మాటలు సజీవంగా ఉంటాయన్నారు. ప్రతి విద్యార్థి రామకృష్ణ పరమహంస, వివేకానందుడి చరిత్రను చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వామి అక్షరాత్మనంద్‌జీ మహరాజ్, స్వామి హృదయానందజీ మహరాజ్, స్వామి సుకృతానంద్‌జీ మహరాజ్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ,కొమ్మిన వెంకటేశ్వరరావు, సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆడైనా.. మగైనా ఒక్కటే..

డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆడైనా, మగ అయినా ఒక్కటే అని గర్భస్థ పిండ లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా అమలు పరిచే గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం (పీసీపీఎన్‌డీటీ యాక్టు) అమలుకు సంబంధించి నిర్వహించిన జిల్లాస్థాయి మల్టీమెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని స్కానింగ్ సెంటర్లన్నీ ఈ యాక్టు అమల్లోకి వస్తాయని, ఎవరైనా చట్టం ఉల్లంఘించి లింగ నిర్ధారణ పరీక్షలు వెల్లడిస్తే చర్యలు తప్పవని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పీఎంఎస్‌ఎంఏ, ఐసీడీఎస్ కన్వర్జెన్సీ సమావేశం, మండలస్థాయి సెర్ప్ మీటింగ్, అన్ని పబ్లిక్‌మీటింగ్స్‌లో దీన్ని ఒక అజెండాగా పెట్టి చట్టంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వని సొసైటీల అనుమతులు రద్దు చేస్తా

కలెక్టర్ ప్రశాంతి హెచ్చరిక

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 8,(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనుమతులు పొంది ఇసుక తవ్వకాలు ప్రారంభించని బోట్స్‌మెన్ సొసైటీలపై అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇసుక అందుబాటులో ఉండేలా 119 మంది బోట్స్‌మెన్ సొసైటీలకు అనుమతులివ్వడం జరిగిందన్నారు. వీటిలో ఇప్పటి వరకు సుమారు 30 సొసైటీలు మాత్రమే కార్యకలాపాలు నిర్వహిస్తుండడంపై అసహనం వ్యక్తం చేశారు. అనుమతులిచ్చిన ప్రతి ఒక్క సొసైటీ క్షేత్రస్థాయిలో తవ్వకాలు చేపట్టాలన్నారు. శనివారం రీచ్‌లు వారీగా క్షేత్రస్థాయిలో పర్యటించి బోట్స్‌మెన్ సొసైటీలతో మాట్లాడడం జరుగుతుందని చెప్పారు.బోట్స్‌మెన్ సొసైటీలు తవ్వకాలు చేపట్టకపోతే అనుమతులు రద్దుచేస్తామని హెచ్చరించారు. జిల్లాలో 13 ఓపెన్ రీచ్‌లకు ఆరుమాత్రమే పనిచేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలకు పెండ్యాల ,తీపర్రు, పందలపర్రు, వంగలపూడి ఓపెన్ రీచ్‌లను అం దుబాటులో ఉన్నాయన్నారు. వినియోగదారులు తగిన ఆధారాలతో ట్రాక్టర్ ద్వారా వచ్చి ఉచితంగా ఇసుక తీసు కెళ్లవచ్చన్నారు. సమావేశంలో ఆర్‌డీవోలు ఆర్ కృష్ణనాయక్, రాణి సుస్మిత, మైన్స్ ఏడీ ఫణిభూషణ్ రెడ్డి, డీటీవో ఆర్.సురేష్, భూగర్భ జల అధికారి వై.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉచిత ఇసుక దర్జాగా తీసుకెళ్లండి : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ/కొవ్వూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం కోటిలింగాల ఇసుక రీచ్‌లను కలెక్టర్ పి.ప్రశాంతి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.రేవుల్లో ఇసుక నిల్వలు, బుకింగ్ పాయింట్ వద్ద క్యూలైన్ తదితర వాటిని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రీచ్‌ల వద్ద 50 శాతం చొప్పున ఆన్‌లైన్ ఆఫ్‌లైన్‌లో ఇసుకను వినియోగదారులకి అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఇసుక రీచ్ స్థాయిని బట్టి రోజుకు కనీసం వెయ్యి నుంచి రెండు వేల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలు చేపట్టాలన్నారు. జిల్లాలో డీసిల్టేషన్, ఓపెన్ రీచ్‌ల ద్వారా కనీసం 30 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. అనుమతి లేని చోట నిల్వచేయడాన్ని గుర్తించి సుమారు 10 యూనిట్ల ఇసుకను సీజ్ చేశారు. సొసైటీలు పరిధులు దాటి ఇసుక నిల్వలు చేస్తున్నట్టు అధికారుల దృష్టికి రావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

డబ్బులు డిమాండ్ చేస్తే చర్యలు : జేసీ

డీసిల్టేషన్, ఓపెన్ ఇసుకర్యాంపుల్లో అదనంగా డబ్బులు డిమాండ్ చేసినవారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని జేసీ ఎస్.చిన్నరాముడు అన్నారు. శుక్రవారం కొవ్వూరు ఎరినమ్మ, వాడపల్లి ఇసుక ర్యాంపులను ఆకస్మిక తనిఖీ చేశారు. ర్యాంపులలో బోట్స్‌మేన్ సొసైటీ సభ్యుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉచిత ఇసుక పాలసీని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఇసుక రవాణాకు ముందుకొచ్చిన ఎల్ వన్ బిడ్స్ వేసిన ఏజెన్సీస్ కార్యకలాపాలు నిర్వహించాలని, లేకపోతే ఎల్2కు కేటాయించడం జరుగుతుందన్నారు. జేసి వెంట కొవ్వూరు తహశీల్దార్ దుర్గాప్రసాద్ ఉన్నారు.



కోటిలింగాల ర్యాంపు తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఆర్‌డీవో కృష్ణనాయక్, మైన్స్ అధికారులు

అక్రమ ఇసుక గుర్తింపు.. కేసు నమోదు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం కోటిలింగాలపేట సాండ్ పాయింట్ దగ్గరలో ఎటువంటి అనుమతులు లేని ఇసుకను, జేసీబీలను గుర్తించడం జరిగిందని ఆర్డీవో కృష్ణనాయక్ వెల్లడించారు.దాడుల్లో శుక్రవారం అక్రమ ఇసుక నిల్వలను గుర్తించామని తెలిపారు. ఎటువంటి అనుమతులు లేని సుమారు రెండు లారీల ఇసుక, జేసీబీలను గుర్తించి ఇసుకను సీజ్ చేయాలల్సిందిగా రెవెన్యూ అధికారులను ఆదేశించినట్టు పేర్కొన్నారు.వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసు నమోదు చేయాలని త్రీటౌన్ పోలీసులకు సూచించామన్నారు.


వరి పంట

- చింతూరు, ఆంధ్రజ్యోతి

కారడవిలో.. కృషీవలురు


నువ్వుల సాగు


చెరువు నిర్మాణ పనులకు కలిసికట్టుగా వెళుతున్న ఆదివాసీ మహిళలు

కష్టాలకు ఎదురొడ్డి నిలిచారు. చెట్ల నీడనే ఆవాసాలుగా మలచుకున్నారు. బురద నీటితో గొంతు తడుపుకున్నారు. కడుపు నింపుకోడానికి కట్టెల సేకరణే ఉపాధిగా మలచుకున్నారు. ఆకలి మంటను నూకల జావతో చల్లార్చుకున్నారు. అయితేనేమి మొక్కవోని దీక్ష వారిది. ఒక్కో అడుగు ముందుకేశారు. కష్టపడ్డారు. చెమటోడ్చారు. ఫలితం కనిపించింది. ఇపుడు వారంతా సిరులు పండిస్తున్నారు. ఎందరికో ఆదర్శమయ్యారు. ఇది అల్లిగూడెం ఆదివాసీల విజయగాథ.


అల్లిగూడెం వాసులు సొంతంగా నిర్మించుకున్న చెరువు



అల్లిగూడెం గ్రామస్తులందరూ చెరువు పనిలో శ్రమదానం.. వలస ఆదివాసీలు సొంతంగా నిర్మించుకున్న ఇల్లు

నాడు కట్టెలమ్ముకొని కడుపునింపుకున్నారు.. నేడు సిరులు పండిస్తున్నారు

ప్రతి నీటి బొట్టుని ఒడిసిపడుతున్నారు.. అల్లిగూడెం వలస ఆదివాసీల విజయగాథ

ఇదొక చిన్న కుగ్రామం. కేవలం 60 కుటుంబాలు నివాసం ఉండే గిరిజన పల్లె అది. కానీ వారి కృషి మాత్రం స్ఫూర్తివంతమైంది. వలస జీవులుగా వచ్చిన వారంతా ఎన్నో కష్టాలు పడ్డారు. ఎంతో స్వేదం చిందించారు. అయినా గానీ ముందుకే నడిచారు. అనుకున్నది సాధించారు. ఇప్పటికీ ఊరంతా కలిసి ఒకే మాట.. ఒకే మాటగా సాగుతున్నారు. ఆ కథేంటంటే.. నాలుగు దశాబ్దాల కిందట ఛత్తీస్‌గఢ్, ఒడిస్సాల నుంచి పలు ఆదివాసీ కుటుంబాలు అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరుకు వలస వచ్చాయి. అక్కడ వారికి సాగుభూమి లేకపోవడం, జీవనోపాధి కష్టతరంగా మారడడంతో వారంతా ఇక్కడకు వలస రావాల్సి వచ్చిందని చెప్పేవారు. చింతూరుకు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న అల్లిగూడెంలో చెట్ల కింద, గుడారాలు వేసుకుని కొంతకాలం జీవనం సాగించారు. ఈ సమయంలో అటవీ ప్రాంతంలో చిన్న చిన్న కట్టెలను సేకరించి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతూరుకు నడిచి వచ్చి విక్రయించేవారు. ఆ కొద్దిపాటి ఆదాయంతో పొట్టపోసుకునేవారు. తర్వాత అల్లిగూడెంలోనే స్థిరనివాసం ఏర్పాటుచేసుకుని అదే ప్రాంతంలో పోడుసాగుకు ఉపక్రమించారు. ఈ విషయం తెలుసుకున్న అటవీ అధికారులు వారిపై కేసులు నమోదు చేశారు. దీంతో వారిలో పలువురు జైళ్లపాలు కావాల్సి వచ్చింది. అయినా వారు వెరువలేదు. చావైనా బతుకైనా ఇక్కడేనని భీష్మించారు. బతుకుపోరులో ఎన్నో కష్టాల్నిష్టాల్ని భరించారు. తినడానికి తిండిలేని రోజుల్ని చూశారు. ఉండటానికి గూడు లేదు.. చెట్ల నీడే ఆవాసాలు. చివరకు అంతా కలిసి వ్యవసాయం చేయడమే జీవనంగా భావించారు. మగవారంతా భూమి చదును పనిలో పడ్డారు. ఇక కట్టెలమ్మడం మహిళల వంతు. అందుకు కాలి నడకన ప్రతి రోజూ చింతూరు రావాల్సి వచ్చేది. ఇట్లా రోజులు, నెలలు కాదు ఏళ్ల తరబడి సాగిన జీవనయాత్ర ఇది. మొత్తంమీద నేలను సాగుకు అనుకూలంగా మలచుకున్నారు. అంతా చేతుల కష్టమే. ఇక మిగిలింది కాసింత గూడు. చేతిలో చిల్లిగవ్వలేదు. అయినా లక్ష్యపెట్టలేదు. ఉమ్మడి కష్టంతో ఇళ్ల నిర్మించుకున్నారు. సాగూ మొదలు పెట్టారు. అయితే నీటి కొరతతో పడ్డ కష్టం చేతికందకుండా పోయేది. దీంతో ఆ సమస్యను అధిగమించాలనుకున్నారు. దీంతో ఊరంతా ఒక్కటై సొంతంగా చెరువులు తవ్వుకున్నారు. వర్షం నీటిని తమ తమ చెరువుల్లోకి వచ్చిపడేలా కాలువలు తవ్వుకున్నారు. చెరువులు నిండాయి. పంటలు పండించారు. చెరువుల్లో చేపలు విడిచారు. ఇప్పుడు ఊరిలో నలభైకిపైనే చెరువులున్నాయి. ప్రతి కుటుంబానికి రెండు, మూడెకరాల పొలం సాగు చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే ఈ పల్లెకు కనీస సౌకర్యాలు కల్పిస్తున్నారు. వీరు పిల్లలను చదివించుకుంటున్నారు. కానీ.. ఈ పొలాలు అటవీ భూములు కావడడంతో పట్టాలు లేవు. వలస జీవులు కావడంతో కుల ధ్రువీకరణ పత్రాల్లేవు. వీటికోసం వీరంతా పోరాడుతున్నారు.


కాకినాడ జీజీహెచ్‌లో హరేకృష్ణా మూమెంట్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భోజన సదుపాయం

అన్నార్తులకు 'అక్షయపాత్రే'

కాకినాడ జీజీహెచ్‌లో హరేకృష్ణా మూమెంట్ సంస్థ ఆధ్వర్యంలో 'సుభోజనం'

నిత్యం రెండు వేల మంది రోగులు, సహాయకులకు ఉచితంగా భోజనం

(ఆంధ్రజ్యోతి- కాకినాడ జీజీహెచ్)



కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రి.. గోదావరి జిల్లాలతోపాటు విశాఖ సరిహద్దు ప్రాంతాల వారికి ఆరోగ్య వరప్రదాయిని. జీజీహెచ్‌కు వైద్యచికిత్సల కోసం నిత్యం వేలాదిమంది రోగులు వస్తుంటారు. ఇక్కడికి వచ్చేవారంతా మధ్యతరగతి, నిరుపేదలే. వీరు హోటళ్లకువెళ్లి డబ్బులు ఖర్చుచేసి భోజనం చేసే పరిస్థితి ఉండదు. వీరి పరిస్థితిని గమనించిన హరేకృష్ణా మూవెంట్ సంస్థ ఉచితంగా సుభోజనం పేరిట కమ్మని భోజనం అందిస్తోంది. హరేకృష్ణా మూమెంట్ సంస్థను భక్తి వేదాంత ప్రభుపాద స్వామి స్థాపించారు. ఒకరోజు బెంగళూరులో భవనం పైఅంతస్తులో కూర్చొని కిటికీలో నుంచి కిందకు తొంగి చూస్తుండగా అక్కడ జరిగిన సంఘటన అక్షయపాత్ర ఏర్పాటుకు బీజం పడింది. రోడ్డు పక్కన పడేసిన విస్తర్లు, ఆకుల్లో ఉన్న ఆహారంకోసం బాలురు, కుక్కలు పోట్లాడుకోవడాన్ని చూసి ఆయన చలించిపోయారు. నిరుపేదల ఆహారం కోసం పడుతున్న ఇబ్బందులు భవిష్యత్తులో ఎక్కడా పడరాదని, ముఖ్యంగా విద్యార్థులు, అన్నార్తులకు ఈ స్థితి ఉండకూడదని భావించారు. హరేరామ్ మూమెంట్ సంస్థ ఉన్న ప్రదేశం నుంచి పది కిలో మీటర్ల పరిధిలో ఏ వ్యక్తి ఆకలితో అలమటించరాదనే ఆశయంతో 2000 సంవత్సరంలో అక్షయపాత్రను బెంగళూరులో తొలుత 1500 మంది విద్యార్థులకు భోజనం అందించే కార్యక్రమాన్ని భక్తి వేదాంత ప్రభుపాదస్వామి ప్రారంభించారు. ఇలా మొదలైన ఈ మూమెంట్ ఇప్పుడు అన్నిచోట్లా విస్తరించింది. మన ప్రాంతంలో విశాఖ కేజీహెచ్‌తోపాటు కాకినాడ జీజీహెచ్‌లో అక్షయపాత్ర ఆధ్వర్యంలో సుభోజనాన్ని రోగులకు ఉచితంగా అందిస్తున్నారు. తొలుత కాకినాడ జీజీహెచ్‌లో రూ.10కే కమ్మని భోజనం ప్రారంభించిన నిర్వాహకులు దాతల సహకారంతో తర్వాత ఉచితంగా రోగులకు ఆహారాన్ని అందించి రోగులు, సహాయకుల కడుపు నింపుతున్నారు. కాకినాడ జీజీహెచ్‌లో వైద్యసేవల కోసం నిత్యం 3వేల నుంచి 3,500 మంది వరకు వచ్చి ఓపీల ద్వారా వైద్యచికిత్స పొందుతుంటారు. ఇన్‌పేషెంట్లుగా మరో 2 వేలమంది వైద్యసేవలు పొందుతుంటారు. జీజీహెచ్ ప్రాంగణంలో సర్జికల్ వార్డుల వద్ద హరేకృష్ణా మూవెంట్ ఆధ్వర్యంలో 2017లో ప్రారంభించిన సుభోజనం నిత్యం రెండు వేల మందికి ఉచితంగా అందిస్తున్నారు. ముఖ్యంగా వైద్యచికిత్సల కోసం ఆస్పత్రికి వచ్చే వారి సహాయకులు బయట తినాలంటే వంద నుంచి రూ.150 వరకు ఖర్చుపెట్టాల్సిన పరిస్థితి. ఇప్పుడు ఉచితంగా లభించడంపై సంతోషం వ్యక్తంచేస్తున్నారు. సుభోజనంలో అన్నంతోపాటు ఒక కూర, పప్పు, సాంబారు, పెరుగు వడ్డిస్తారు. దాతల సహకారాన్ని బట్టి ఒక్కోసారి ప్రత్యేక వంటకాలనూ వడ్డిస్తున్నారు.

వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.2.67లక్షలు


వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు చేస్తున్న భక్తులు

ఆత్రేయపురం, నవంబరు8(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,67,940 లభించినట్టు ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు.

కార్తీక శనివారాల్లో భక్తులకు లఘు దర్శనమే


ఉపకమిషనర్ సూర్యచక్రధరరావు

వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం నాలుగు శనివారాలు భక్తులకు లఘుదర్శనమే అందిస్తున్నట్లు ఉప కమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు పేర్కొన్నారు. కార్తీక శనివారాలలో భక్తుల రద్దీ అంచనాలకు మించి తరలిరావడంతో క్యూలైన్లలో భక్తులు గంటల వ్యవధి వేచి ఉంటున్నారు. వేద ఆశీర్వచనం విశిష్ఠ, సర్వదర్శనం, తదితర టిక్కెట్లు పొందిన భక్తులకు లఘుదర్శనం మాత్రమే అందిస్తున్న ట్లు వివరించారు. ఈ విషయాన్ని భక్తులు గమనించి సహకరించాలని కోరారు.

భీమేశ్వరుడి అన్నదాన ట్రస్టుకు రూ. 100116 విరాళం

ద్రాక్షారామ, నవంబరు8(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి అన్నదాన ట్రస్టుకు గురువారం ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం పూళ్ల గ్రామానికి చెందిన బొండాడ కస్తూరి కుమారుడు బొండాడ సుబ్బరాజు రూ.1001116లు అందజేశారు. ఆలయ సీనియర్ సహాయకుడు సూరపురెడ్డి వెంకటేశ్వరరావు బొండాడ సుబ్బరాజు దంపతులకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.


సుబ్బరాజు దంపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న సిబ్బంది



ఆంధ్రప్రదేశ్ దిగ్దర్శనం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్

రాష్ట్ర సాంస్కృతిక వైభవం పునరుద్ధరణకు కృషి

● రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖల మంత్రి కందుల దుర్గేష్

దివాన్‌చెరువు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎంతో విశిష్టత కలిగిన ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవాన్ని పునరుద్ధరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్, కామర్స్ కళాశాల ఆంగ్ల విభాగం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి, సెంటర్ ఫర్ ఆంధ్రప్రదేశ్ స్టడీస్ (కాప్స్) సంయుక్త ఆధ్వర్యంలో నన్నయ ప్రాంగణంలో రెండు రోజులు జరిగిన ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం సదస్సు శుక్రవారం ముగిసింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఆదికవి నన్నయ, టంగుటూరిప్రకాశంపంతులు, కందుకూరి వీరేశలింగం వంటి మహనీయులు రాజమహేంద్రవరంలో నడయాడారని, కోస్తా తీరంనాగరికతకు నెలవు అని చెప్పారు. రాష్ట్రంలో ఎన్నో కళారూపాలు ఉన్నాయని, వాటిని సినిమా వైపు మాత్రమే కాకుండా స్వీయ అభిలాషతో స్వీకరించి ఆదరించాలన్నారు. తెలుగు భాష చాలా ప్రాచీనమైనదని, దాని ఆధారాలను భద్రపరుచుకోవలసిన అవసరం ఉందన్నారు. తెలుగు భాష, సంస్కృతి, సాహిత్యాలను ప్రపంచ దేశాలకు తెలియజెప్పాలన్నారు. సంస్కృతి వైభవం కోసం కృషి చేసే విధంగా ముందడుగు వేయాలన్నారు. చరిత్రను అర్థం చేసుకుంటేనే భవిష్యత్తును నిర్మించుకోగలమన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషిచేస్తామన్నారు. తెలుగు విశ్వవిద్యాలయాన్ని రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసేందుకు పాటుపడతామన్నారు. ఆంధ్రప్రదేశ్ దిగ్దర్శనం, ఆంధ్రశక్తి వారి ఈట్ టూ ఫీడ్ పుస్తకాలను, వీసీ శ్రీనివాసరావు రూపొందించిన జియాలజికల్ మ్యాప్‌ను మంత్రి ఆవిష్కరించారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ ప్రత్యేక నిధులు తీసుకువచ్చి విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కాప్స్ అధ్యక్షుడు డాక్టర్ కర్రి రామారెడ్డి, ప్రతినిధి సీహెచ్ విజయానంద ఆదిత్య, కన్వీనర్లు ఆచార్య కె.శ్రీరమేష్, ఆచార్య డి.జ్యోతిర్మయి పాల్గొన్నారు.

కొనసాగుతున్న జిమ్నాస్టిక్స్ పోటీలు

● రెండో రోజు విజేతలు వీరే

కాకినాడ అర్బన్, నవంబరు 8: పాఠశాలల రాష్ట్ర సమాఖ్య 68వ జిమ్నాస్టిక్స్ అంతర్‌జిల్లాల పోటీలు కాకినాడ డీఎస్‌ఏ మైదానంలోని ఆడిటోరియంలో రెండోరోజు కొనసాగాయి. వివిధ విభాగాలు క్రీడాకారులు తమ ప్రతిభనుచాటారు.

● ఆల్‌రౌండ్ చాంపియన్‌షిప్ అండర్-14 బాలికల విభాగంలో కె.సరయు(కృష్ణా) మొదటి స్థానం, ఎస్‌కే నషీమా(గుంటూరు) రెండోస్థానం, వై.కిరణ్మయి(వైఎస్ఆర్ కడప) తృతీయస్థానంలో నిలిచారు. అండర్-17 ఆల్‌రౌండ్ చాంపియన్‌షిప్‌లో ఎస్.కీర్తన(కృష్ణా), పి.అస్మిత(గుంటూరు), ఎస్‌ఎల్ మధులత (తూర్పుగోదావరి) విజేతలుగా నిలిచారు.


జిమ్నాస్టిక్స్ పోటీల్లో విన్యాసాలు చేస్తున్న క్రీడాకారులు

పోలవరం జల విద్యుత్ కేంద్రంలో స్టేరింగ్ అమరిక పనులు ప్రారంభం

దేవీపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోలవరం జల విద్యుత్ కేంద్రంలో టర్బైన్ల ఏర్పాటులో కీలకమైన స్టేరింగ్‌ల అమరిక పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇందుకు 320 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన క్రాలర్ క్రేన్ వినియోగిస్తున్నారు. తొలుత ఏపీ జెన్‌కో ఎస్ఈ రామభద్రరాజు, ఈఈ వై.భీమదనరావు, ఎంఈఐఎల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్ బాబు అంగర, ఎలక్ట్రో మెకానికల్ విభాగం సీనియర్ మేనేజర్ మణికంఠ పాల్గొన్నారు. ఒక్కో స్టేరింగ్ 4 విభాగాలుగా ఉంటుంది. బరువు 136 మెట్రిక్ టన్నులు. విద్యుత్ ఉత్పత్తికి వినియోగించే కప్లాన్ టర్బైన్లు సమర్థవంతంగా పనిచేయడంలో ఈ స్టేరింగ్‌లు కీలక పాత్ర పోషిస్తాయి. ప్రాజెక్టులో కీలకమైన నిర్మాణ పనులను వీటి అమరిక తర్వాత తరువాత కొనసాగిస్తారు. ఎస్ఈ రామభద్రరాజు మాట్లాడుతూ.. జల విద్యుత్ కేంద్రంలో స్టేరింగ్‌ల ఏర్పాటు తర్వాతే టర్బైన్లు అమరుస్తారని తెలిపారు. ప్రాజెక్టు పనులుజాప్యం కాకుండా ఉండేందుకు అన్ని పనులు సమాంతరంగా చేస్తున్నట్టు తెలిపారు. నిర్దేశించిన సమయానికి ప్రాజెక్టు పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నట్టు ఎంఈఐఎల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్‌బాబు చెప్పారు.


జలవిద్యుత్ కేంద్రం వద్ద స్టేరింగ్ అమరిక పనులు నిర్వహిస్తున్న దృశ్యాలు

ఎమ్మెల్సీ ఎన్నికలకు రాజకీయ ప్రతినిధులు సహకరించాలి

● కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్ కోర్టుహాలులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసిందన్నారు. నవంబరు 11న ఎన్నికల నోటిఫికేషన్ జారీ అవుతుందన్నారు. ఈనెల 18 వరకు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. ఈనెల 19న నామినేషన్లు పరిశీలన ఉంటుందన్నారు. ఈనెల 21న నామినేషన్లు ఉపసంహరణ చేసుకోవచ్చునన్నారు. డిసెంబరు 5న పోలింగ్, పోలింగ్ బ్యాలెట్ పేపర్ ద్వారా మాత్రమే నిర్వహిస్తారన్నారు. డిసెంబరు 9న ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. ఈ దృష్ట్యా తూర్పు, పశ్చిమ గోదావరి ఉమ్మడి జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. కాకినాడ జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా, ఈఆర్వోగా కాకినాడ జిల్లా డీఆర్వో వ్యవహరిస్తారన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో 113 మండలాల్లో మొత్తం 16,316మంది ఓటర్లు ఉన్నారన్నారు. అందులో 9642మంది పురుషులు, స్త్రీలు 6674 మంది ఉన్నారన్నారు. 116 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ ఆఫ్ ఎలక్టోరల్ రోల్ 2025 కింద 29-10-2024న డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేశామన్నారు.

కాకినాడ జిల్లాలో 16లక్షల35వేల30మంది సాధారణ ఓటర్లుగా నమోదయ్యారన్నారు. ఇందులో 8,04,834మంది పురుషులు, 8,30,002మంది మహిళలు, 190మంది ఇతరులు ఉన్నారన్నారు. 18ఏళ్లు నిండిన వారు ఎవరైనా తమ ఓటుహక్కును నమోదు చేసుకునేందుకు స్పెషల్ క్యాంపెయిన్ డేస్‌గా ఈనెల 9,10,23,24 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. బీఎల్‌వోలు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్‌స్టేషన్‌లో అందుబాటులో ఉంటారని అర్హులు తమ సమీప పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వో వద్ద ఓటు నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఆమ్‌ఆద్మీపార్టీ రామకృష్ణ, బీఎస్పీ అప్పారావు, బీజేపీ వెంకటేశ్వర రావు, టీడీపీ జయప్రకాష్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నోడల్ అధికారిగా జడ్పీ సీఈవో

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) జిల్లా నోడల్ అధికారిగా తూర్పు గోదావరి జిల్లా జడ్పీ సీఈవో లక్ష్మణరావును నియమించారు. ఈ మేరకు కాకినాడ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులను వెలువరించారు. ఎంసీసీ నోడల్ అధికారిగా ఆయన కోడ్ ఉల్లంఘనలపై చర్యలు తీసుకుంటారు.

ఎటువంటి చర్చ లేకుండా ముగిసిన స్థాయీ సంఘాల సమావేశాలు

కాకినాడ సిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి చర్చ, ఏ విధమైన తీర్మానాలు లేకుండా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలను ముగించారు. శుక్రవారం కాకినాడలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన 1 నుంచి 7 వరకు స్థాయి సంఘాల సంఘాల సమావే శాలకు జడ్పీ చైర్మన్ వి.వేణుగోపాలరావు, వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, వైస్‌చైర్‌పర్సన్ పద్మలత, స్థాయిసంఘ చైర్‌పర్సన్ మేరుగు పద్మావతి అధ్యక్షత వహించారు. సమావేశాల్లో జడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో జీఎస్ రామ్‌గోపాల్, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు


సత్యదేవుని దర్శనానంతరం కుటుంబీకులతో న్యాయమూర్తి

సత్యదేవునికి పాట్నా హైకోర్టు న్యాయమూర్తి
అనుపమ చక్రవర్తి పూజలు

అన్నవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధికి శుక్రవారం పాట్నా హైకోర్టు న్యాయమూర్తి అనుపమ చక్రవర్తి కుటుంబ సభ్యులతో విచ్చేశారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.


పంపా సరోవరంలో ట్రయల్ రన్ నిర్వహిస్తున్న అధికారులు

హంస వాహనం పంటుకు ట్రయల్ రన్

అన్నవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి ప్రతిఏటా క్షీరాబ్ది ద్వాదశి పర్వదినాన నిర్వహించే తెప్పోత్సవం ఈనెల 13న జరగనుంది. ఈ నేపథ్యంలో పంటుకు శుక్రవారం దేవస్థానం ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్ అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. పంటు వేగం, ఎక్కడి నుంచి ఎక్కడకు సరోవరం చుట్టూ విహరించాలనే దానిపై ఒక అవగాహనకు వచ్చారు. రెండ్రోజుల్లో ఈ పంటును హంస వాహనంగా అలంకరించి రెవెన్యూ, పోలీసు, దేవస్థానం, ఇతర శాఖల అధికారుల సమక్షంలో మరోసారి ట్రయల్ రన్ నిర్వహిస్తామని ఎలక్ట్రికల్ డీఈ సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పీఆర్వోకు చెక్కు అందజేస్తున్న దాత వెంకటరెడ్డి

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి
రూ.లక్ష విరాళం

అన్నవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం విశాఖపట్నానికి చెందిన కె.బాలసుబ్రహ్మణ్యం రూ.1,00,116 విరాళంగా సమర్పించారు. దాత ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో ఆలయ పీఆర్వో వెంకటరెడ్డికి అందజేశారు. దాతను ఆయన అభినందించి ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించి స్వామివారి ప్రసాదం అందజేశారు.

నేటి నుంచి రామస్వామి
జయంత్సుత్సవాలు

పిఠాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద శ్రీవల్లభుల స్వామి జన్మస్థానంగా ప్రసిద్ధి గాంచిన శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానం పీఠాధిపతి, గురువు సజ్జనగడ రామస్వామి శత జయంతి మహోత్సవాలు శనివారం ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మహా సంస్థానం గోశాల ప్రాంగణంలో జరిగే ఉత్సవాల్లో తొలి రోజైన 9వ తేదీ ఉదయం విఘ్నేశ్వరుని పూజ, పుణ్యాహవాచనం, ఋత్విక్‌వరుణ, శ్రీపాదశ్రీవల్లభ స్వామికి శత రుద్రీయ అభిషేకం, సద్గురు రామస్వామి పాదుకలకు అభిషేకం, పూజ జరుగుతాయి. సాయంత్రం హోమం, చతుర్వేద స్వస్తి. 10వ తేదీ శ్రీపాద శ్రీవల్లభులు, సజ్జనగడ రామస్వామి దివ్య పాదుకలకు శత రుద్రీయ అభిషేకం, హోమం, నీరాజన మంత్రపుష్పాలు, చతుర్వేద స్వస్తి. 11వ తేదీన సద్గురు రామస్వామి శతజయంతి సందర్భంగా శ్రీపాదులు, రామస్వామి దివ్యపాదులకు అభిషేకాలు, పూజ, హోమం, పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పాలు, చతుర్వేద స్వస్తి, మహదాశీర్వచనం నిర్వహిస్తారు. భక్తులు తరలివచ్చి శ్రీపాదశ్రీవల్లభులు, సజ్జనగడ రామస్వామి గురువర్యుల అనుగ్రహానికి పాత్రులు కావాలని మహా సంస్థానం కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య కోరారు. జయంత్యుత్సవాలకు విచ్చేసే భక్తుల కోసం ఏర్పాట్లు చేస్తున్నామని ఆమె చెప్పారు.



ఇంగ్లీష్ టీచర్ సస్పెన్షన్

కాకినాడ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం తూరంగి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్‌గా పని చేస్తున్న మహ్మద్ తానీషా వలీబాబాను సస్పెండ్ చేస్తూ డీఈవో పి.రమేష్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఆ ఉపాధ్యాయుడిపై ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం ద్వారా కేసు నమోదైంది. ఆ అభియోగాలన్నీ రుజువైన కారణంగా విధుల నుంచి సస్పెండ్ చేశామన్నారు. అయితే అతను గతంలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన పాఠశాలల్లో కూడా ఈ విధంగా ప్రవర్తించాడని తెలిసింది. విద్యార్థినులకు అసభ్యకరమైన వీడియోలు చూపించేవాడని సమాచారం.

కూటి కోసం వెళ్లి... కానరాని లోకాలకు..

- ఒకరిని కాపాడబోయి... మునిగిపోయిన మరో ముగ్గురు...
- నలుగురి గల్లంతుతో రోడ్డునపడ్డ రెండు కుటుంబాలు
- ఇద్దరి మృతదేహాలు లభ్యం
- అల్లూరి జిల్లా అడ్డతీగల మండలం బొంగరాలపాడు ఏలేరు వాగులో ఇసుక తీస్తుండగా దుర్ఘటన
- ఏలేశ్వరం మండలం తూర్పు లక్ష్మీపురంలో విషాదఛాయలు


సంఘటనాస్థలంలో గల్లంతైన వారి కోసం గాలింపు


బాధిత కుటుంబాన్ని ఓదారుస్తున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ

అడ్డతీగల/ఏలేశ్వరం/తాళ్లపూడి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం తూర్పులక్ష్మీపురం గ్రామానికి చెందిన వీరమళ్ల భూషణం(60), అతడి కుమారుడు వీరమళ్ల జయబాబు(26), అతడి అల్లుడు తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం అన్నదేవర పేటకు చెందిన బేదంపూడి చిన్నగొంతియ్యతోపాటు తూర్పులక్ష్మీపురానికి చెందిన మరో వ్యక్తి చింతా శ్రీనివాస్(19) కూలి పనులు చేస్తుంటారు. తూర్పులక్ష్మీపురం గ్రామానికి అడ్డతీగల మండలం బొంగరాలపాడు ఏలేరువాగు దగ్గర్లోనే ఉంటుంది. అక్కడ ఇసుక తవ్వకం పనులకు వెళ్లి ఉపాధి పొందుతుంటారు. ఇసుక తవ్వి దాన్ని ట్రాక్టర్లలో లోడింగ్ చేసి పరిసర ప్రాంతా లకు తరలించే పనిచేస్తుంటారు. ఇక్కడ ఇసుక ర్యాంపునకు అనుమతి లేదు. కొన్నాళ్ల క్రితం ఈ ప్రదేశంలో ఇసుక తవ్వకాలు జోరుగా జరిగాయి. దీంతో అక్కడ గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల వర్షాలకు ఆ ప్రాంతమంతా నీరు ఎక్కువగా చేరి ఆ గుంతలు బురదతో నిండి ఊబి మాదిరిగా మారాయి. ఈ నేపథ్యంలో ఆ వాగులో ఇసుక తీసే ప్రాంతంలో ప్రమాదకరంగా ఉంది. కాగా శుక్రవారం కూడా అదే మాదిరిగా ఇసుకతీత పనినిమిత్తం అక్కడకు చేరుకున్నారు. కానీ, అక్కడ గుంతలు ఏర్పడిన విషయం గ్రహించలేకపోయారు.మధ్యాహ్నం ముగ్గురూ ఇసుకతీతకోసం వాగులోకి దిగారు. ఒడ్డునే ట్రాక్టర్ కూడా ఉంది. మళ్లీ వాగు లోపలికి వెళ్లగా తొలుత ఒకరు ప్రమాదవశాత్తూ లోపలికి మునిగిపోతున్నారు. అతడ్ని కాపాడే ప్రయత్నంలో మరొకరు.. తర్వాత ఇంకొకరు ఇలా నలుగురూ వాగులో మునిగిపోయారు. అంతా క్షణాల్లో జరిగిపోయింది. ఒకరిని కాపాడేందుకు వెళ్లి మరో ముగ్గురు కలిసి మొత్తం నలుగురు గల్లంతయ్యారు. ఇసుక తవ్వకాలకు వెళ్లి గల్లంతైన నలుగురూ పేద కుటుంబానికి చెందినవారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే తూర్పులక్ష్మీపురం నుంచి బంధువులు బొంగరాలపాడు సంఘటనా స్థలానికి బయలుదేరి వెళ్లిపోయారు. సాయంత్రానికి తిరిగి వచ్చేస్తానని చెప్పిన వారికి ఇలా జరగడంతో వారు రోదిస్తున్న తీరు కంటతడి పెట్టించింది.

బావ, బావమర్దుల మృతదేహాల వెలికితీత

అప్పటికే సమాచారం అందుకున్న పోలీసులు, డివిజన్ అధికారులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వీరిలో రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, డీఎస్పీ సాయిప్రశాంత్ పరిసరాలను పరిశీలించి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో గాలింపు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వెంటనే ఆయా బృందాలు రంగంలో దిగి వలల సహాయంతో వీరమళ్ల జయబాబు, బేదంపూడి గొంతియ్య మృతదేహాలు వెలికితీశాయి. సంఘటనాస్థలాన్ని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి వెళ్లి పరిస్థితిని పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే సత్యప్రభ పరామర్శ

ఏలేరు వాగులో గల్లంతైన బాధితుల కుటుంబానికి సంఘటనాస్థలానికి వెళ్లి ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఓదార్చారు. ఆమె స్పందిస్తూ దుర్ఘటన జరగడం చాలా బాధాకరమని, వీలైనంత త్వరగా మృతదేహాలను వెలికి తీయాలని అధికారులకు సూచించారు. బాధితుల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు.

చదువు ఆపేసి.. పనులకు వెళ్తూ...

ఇదే గ్రామానికి చెందిన చింతా గోపి, సత్యవతి దంపతులకు కుమారుడు శ్రీనివాస్(16). అతడికి దుర్గ అనే సోదరుడు, భూమిక అనే సోదరి ఉంది. అతడు ఇటీవలే ఏలేశ్వరం ప్రభుత్వజూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశం పొంది మధ్యలో చదువు ఆపేశాడు. కుటుంబపోషణకు కూలీ పనికి వెళ్తుంటాడు. భూషణం వెంట శ్రీనివాస్ కూడా వెళ్లి వాగులో గల్లంతు కావడంతో కుటుంబ సభ్యుల్లో విషాదం నింపింది.

ఒకే కుటుంబం... అతలాకుతలం

ఏలేశ్వరం మండలం తూర్పులక్ష్మీపురం గ్రామానికి చెందిన వీరమళ్ల భూషణం, వీరమళ్ల జయబాబు, తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన బేదంపూడి చిన్నగొంతియ్య ముగ్గురూ ఒకే కుటుంబానికి చెందినవారు. ఒకే కుటుంబంలో తండ్రి, కొడుకు, అల్లుడు ఇలా కావడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. వీరమళ్ల భూషణం కుమారుడు జయబాబు. వీళ్లు రోజువారీ కూలి పనులకు వెళ్తుంటారు. వీరివెంట బేదంపూడి చినగొంతియ్య కొన్నాళ్లుగా పనులకు వెళ్తున్నాడు. అతడు గతంలో తన స్వగ్రామంలో పెయింటింగ్ పనులు చేసేవాడు. ఇటీవల అతడి భార్య భారతిని ప్రసవానికి ఆమె పుట్టింటికి తీసుకువెళ్లాడు. అక్కడ అతనికి కొడుకు పుట్టాడు. అక్కడే తనమామ, బావమరిదితో పనులకు వెళ్తున్నాడు. ఈ తరుణంలో శుక్రవారం ఇసుకతీత, లోడింగ్ పనికి వెళ్లాడు. అక్కడ అనుకోకుండా జరిగిన ప్రమాదంలో మునిగిపోతున్నవారికి సహాయం చెయ్యబోయి గల్లంతయ్యాడు. దీంతో కుటుంబం అతలాకుతలమైంది.

రాష్ట్ర ప్రభుత్వ అవార్డుకు సామర్లకోట ఉర్దూ ఉపాధ్యాయుడి ఎంపిక


సయ్యద్ సైపులా

సామర్లకోట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సామర్లకోటలో అగస్థానా మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఉర్దూ పాఠాలు బోధించే ఎస్‌జీటీ ఉర్దూ పండిట్ సయ్యద్ సైపుల్లా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయుడిగా ప్రభుత్వ అవార్డుకు ఎంపిక చేస్తూ శుక్రవారం రాత్రి అమరావతి నుంచి ఏపీ రాష్ట్ర ఉర్దూ అకాడమీ (విజయవాడ) సంచాలకుల నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. నవంబరు 11 మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి పురస్కరించుకుని ఏటా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డులు అందజేయడం జరుగుతుంది. ఈ అందులో భాగంగా ప్రభుత్వం ఈ పురస్కారానికి సయ్యద్ సైపులాను ఎంపిక చేసింది. 24ఏళ్ల ఉర్దూ పండిట్‌గా సామర్లకోట మున్సిపల్ పాఠశాలలో ఆయన పనిచేస్తున్నారు. ఈనెల 11న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అవార్డు అందుకోనున్నారు.

సెలవులోకి కాకినాడ జేసీ

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేసీ రాహుల్‌మీనా వ్యక్తిగత పనులపై సెలవులోకి వెళ్లారు. వచ్చే బుధవారం జిల్లాలో ఆయన తిరిగి అందుబాటులోకి వస్తారని కలెక్టరేట్ అధికారులు తెలిపారు. ఇన్‌చార్జి జేసీగా డీఆర్వో వెంకట్రావు బాధ్యతలు నిర్వహిస్తారు.

భర్త ఇంటి వద్ద మౌన పోరాటం

- తనను, పిల్లలను వదిలేశాడని ఆవేదన
- వేరే మహిళతో సహజీవనం చేస్తున్నాడని ఆరోపణ
- పవన్ కల్యాణ్ న్యాయం చేయాలని వినతి


భర్త ఉంటున్న ఇంటి ఎదుట ఇద్దరు పిల్లలతో కలిసి మౌన పోరాటానికి దిగిన సౌమ్యలక్ష్మి

పిఠాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేరే మహిళతో సహజీవనం చేస్తూ తనను వదిలించుకోవాలని చూస్తున్నాడని, ఇద్దరు పిల్లలకు అన్యాయం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తూ ఇద్దరు కుమార్తెలతో కలిసి ఒక మహిళ కాకినాడ జిల్లా పిఠాపురంలోని భర్త ఇంటి ఎదుట మౌన పోరాటానికి దిగింది. తన భర్త తనకు కావాలని, పిల్లలను అన్యాయం చేయవద్దని ఆమె కోరింది. మహిళ తల్లిదండ్రులు పెంకే త్రిమూర్తులు, సరస్వతి తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం వెదురుమూడి గ్రామానికి చెందిన పెంకే సౌమ్యలక్ష్మికి రాజమహేంద్రవరం లలితానగర్‌కు చెందిన విత్తనాల రామలక్ష్మణకుమార్‌తో 2017లో అన్నవరంలో వివాహమైంది. పెళ్లయిన నాటి నుంచి భర్త, అత్తమామలు తరచూ అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తుండడంతో అంగర పోలీసుస్టేషన్లో గతంలో ఫిర్యాదు చేశారు. అనంతరం కూడా వారు వేధింపులు ఆపలేదు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈలోగా రామలక్ష్మణకుమార్ పిఠాపురం పట్టణంలోని వైఎస్‌ఆర్ గార్డెన్స్‌లో వేరే మహిళతో సహజీవనం చేయడం ప్రారంభించాడు. పిల్లలకు అన్యాయం చేయవద్దని కలిసి ఉందామని తన కుమార్తె కోరినా అల్లుడు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భర్త ఎంతకూ పట్టించుకోకపోవడంతో సౌమ్యలక్ష్మి తనకు భర్త కావాలంటూ, తన పిల్లలకు తండ్రి కావాలంటూ వైఎస్సార్ గార్డెన్స్‌లో భర్త ఉంటున్న ఇంటి ఎదుట శుక్రవారం అందోళనకు దిగింది. చేపట్టింది. భర్త తనను, పిల్లలకు కాపురానికి తీసుకువెళ్లేవరకూ మౌన పోరాటం విరమించేది లేదని స్పష్టం చేశారు. కాగా భర్త పట్టించుకోకపోవడంతో తన కుమార్తె సౌమ్యలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు (5,6 ఏళ్లవయసు) అనాథలుగా మారారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. పిల్లలతో కలిసి సౌమ్యలక్ష్మి చేపట్టిన ఆందోళనకు కాకినాడ టీడీపీ మహిళా నేత సత్యభామ, జనసేన వీరమహిళ వెంకటలక్ష్మి, కుంచే మణి సంఘీభావం ప్రకటించారు.


ఎఫ్ఎల్ఎన్ శిక్షణలో కృత్యాన్ని పరిశీలిస్తున్న కోనసీమ డీఈవో సలీంబాషా

విద్యార్థులతో మమేకమై బోధించాలి

దివాన్‌చెరువు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులతో మమేకమై వారి స్థాయికి వెళ్లి విద్యా బోధన చేయాలని, అప్పుడే అభ్యసనా సామర్థ్యాలను చేరుకునే అవకాశం ఉంటుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఈవో షేక్ సలీంబాషా అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం కొండగుంటూరులో ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఆటపాటలతో కూడిన విద్యను అందించేందుకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ దోహదం చేస్తుందన్నారు. ఉపాధ్యాయులు చేస్తున్న యాక్టివిటీస్‌ను ఆయన స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. శిక్షణా కేంద్రం వెన్యూ ఇన్‌చార్జి పి.రాంబాబు ఉపాధ్యాయులు శిక్షణ పొందుతున్న విధానాన్ని డీఈవోకు వివరించారు. ఉపాధ్యాయుల నుంచి డీఈవోఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. డీఈవో వెంట కోనసీమ జిల్లా సమగ్ర శిక్షా సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, రాష్ట్ర పరిశీలకుడు అరవ ప్రభాకర్, ఏపీ ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ పి.సాయి వెంకటరమణ ఉన్నారు.

బాలికను మోసగించిన ఆటో డ్రైవర్ అరెస్టు

ప్రత్తిపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదో తరగతి చదువున్న బాలికకు మాయమాటలు చెప్పి లోబరుచుకున్న ఆటో డ్రైవర్‌ను ప్రత్తిపాడు పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. దీనికి సంబంధించి సీఐ బి.సూర్యఅప్పారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంరాచపల్లికి చెందిన ఆటో డ్రైవర్ పెదిరెడ్డి కృపారాజు తన కుమార్తె, కుమారుడులతో పాటు అదే గ్రామానికి చెందిన 8వ తరగతి బాలికను రోజూ స్కూలుకు తీసుకెళ్లేవాడు. ప్రేమిస్తున్నాను, పెళ్లి చేసుకుందామని మాయమాటలు చెప్పి లోబరుచుకున్నాడు. గత నెల 30న బాలికను తీసుకుని ధర్మవరం, రాజమహేంద్రవరం, భీమవరం, కాకినాడ పరిసర ప్రాంతాల్లో తిప్పుతూ పలుసార్లు శారీరక సంబంధం పెట్టుకున్నాడు. తొలుత బాలిక తల్లిదండ్రులు తమ కుమార్తె కనిపించట్లేదని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. అయితే ఆ బాలిక తల్లిదండ్రుల వద్దకు చేరుకుంది. తహసీల్దారు వద్ద జరిగిన సంఘటనలను వివరించింది. దీంతో ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు పెద్దాపురం ఎస్‌డీపీవో బి.శ్రీహరిరాజు దర్యాప్తు నిర్వహించి నిందితుడు కృపారాజుపైపోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడిని పట్టుకునేందుకు డీఎస్పీ ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 7న ధర్మవరం గ్రామ శివారున అరెసుట చేసి కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. త్వరితగతిన విచారణ పూర్తి చేసి బాలిక ఆచూకీ కనుగొని నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపడంలో కృషి చేసిన పెద్దాపురం డి.శ్రీహరిరాజు, ప్రత్తిపాడు సీఐ సూర్యఅప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతంలను ఎస్పీ అభినందించారు.

భర్తపై అలిగి... శవమై తేలి

పోలవరం కాలువలో మహిళ మృతదేహం అభ్యం


ఏసమ్మ (పాత చిత్రం)

జగ్గంపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట-గోకవరం రోడ్డులో పోలవరం కాలువలో శుక్రవారం మహిళ మృతదేహం లభ్యమైందని ఎస్ఐ రఘునాథరావు తెలిపారు. జగ్గంపేట సత్యవేణిపేటకు చెందిన నక్క ఏసమ్మ (22)కు, అదే గ్రామానికి చెందిన వెలుగుల వీర దుర్గాప్రసాద్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. వారికి పది నెలల బాబు ఉన్నాడు. ఏసమ్మ భర్తతో తరుచూ గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయేది. సర్దిచెప్పడంతో రెండు, మూడు రోజుల తర్వాత భర్త వద్దకు వచ్చేది. ఈ నెల 6వ తేదీ సాయంత్రం జగ్గంపేట సెంటర్లో పానీపూరీ తిన్న తర్వాత భర్తను సినిమాకు వెళ్దామని అడిగింది. భర్త సమయం లేదని చెప్పడంతో మనస్థాపానికి గురై ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. ఈ విషయాన్ని దుర్గాప్రసాద్ అత్తగారికి చెప్పాడు. ఆమె కూతురు తమ ఇంటికి రాలేదని చెప్పింది. కోపం తగ్గిన తర్వాత వస్తుందిలే అని చెప్పడంతో ప్రసాద్ ఎటువంటి ఫిర్యాదు చేయలేదు. ఈలోగా గ్రామానికి చెందిన వ్యక్తి పోలవరం కాలువలో మహిళ మృతదేహం కనిపించిందని ఏసమ్మ తల్లి వరలక్ష్మికి చెప్పాడు. దీంతో ఆమె పోలీసులకు విషయం తెలపగా వారు పోలవరం కాలువ వద్దకు వచ్చి మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతురాలి తల్లి వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.


పట్టుకున్న గంజాయిని , సరఫరా చేస్తున్న వ్యక్తిని చూపిస్తున్న పోలీసులు

21 కిలోల గంజాయితో యువకుడి అరెస్టు

ప్రత్తిపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి వద్ద 21 కిలోల గంజాయితో ఓ యువకుడిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న సూర్యాపేట మండలం సూర్యాపేట సందు పైజార్‌కు చెందిన 29 ఏళ్ల కోలా మణికంఠ అలియాస్ మణిదీప్ గంజాయి తాగుతూ గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా పశుపుల్లంక అటవీ ప్రాంతం నుంచి హైదరాబాద్‌కు 21 కిలోల గంజాయి తరలిస్తున్నాడు. అతడిని రాచపల్లి గ్రామ శివారున డీఎస్పీ శ్రీహరిరాజు ఆధ్వర్యంలో సీఐ బి.సూర్యఅప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం అరెస్టు చేశారు. నిందితుడిని పట్టుకున్న ప్రత్తిపాడు సీఐ, ఎస్ఐలను ఎస్పీ, డీఎస్పీలు అభినందించారు.

విహార యాత్రలో విషాదం

సోకిలేరు వాగులో కొట్టుకుపోయి యువకుడి మృతి


సత్యవరుణ్ (పాత చిత్రం)

మోతుగూడెం/మలికిపురం, నవంబరు 8 (ఆంధ్ర జ్యోతి): అల్లూరి సీతారామ రాజు జిల్లా మోతుగూడెం పరిధిలోని సోకిలేరు వాగుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నుంచి నలుగురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై శుక్రవారం విహార యాత్రకు వచ్చారు. సోకిలేరు వ్యూ పాయింట్ వద్ద ఆగి సెల్ఫీలు దిగారు. అనంతరం స్నానం చేయడం కోసం వాగులోకి దిగారు. వారిలో 20 ఏళ్ల గద్దం సత్యవరుణ్ కాలు జారి ప్రవాహ వేగానికి వాగులో కొట్టుకుపోయాడు. స్నేహితులు కాపాడే ప్రయత్నం చేశారు. వెంటనే మోతుగూడెం ఎస్ఐ శివనారాయణకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. లక్కవరం నుంచి గత ఈతగాళ్లను రప్పించి వెతికించారు. కొద్దిసేపటి తర్వాత ఆచూకీ లభ్యమైంది. విగత జీవిగా పడి వున్న వరుణ్‌ను ఒడ్డుకు చేర్చి చింతూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే ప్రాణం కోల్పోయినట్టు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కాగా సత్యవరుణ్‌ది మలికిపురం మండలం ఇరుసుమండ గ్రామం. ఇతడు వెటర్నరీ కోర్సు చదివినట్టు సమాచారం. వరుణ్ తన చిన్నాన్న కుమారుడు, స్నేహితులతో కలిసి చింతూరు విహార యాత్రకు వెళ్లగా వాగులో కొట్టుకుపోయి మృతి చెందాడు. ఇతడి తండ్రి బాబూరావు గల్ఫ్‌లో ఉంటున్నాడు. తల్లి అరుణప్రియ ఇరుసుమండలో ఉంటుంది. తమ్ముడు చదువుకుంటున్నాడు.

సదరం ధ్రువీకరణాల పేరిట వసూళ్లు

వ్యక్తిని పట్టుకున్న సెక్యూరిటీ సూపర్‌వైజర్

రామచంద్రపురం (ద్రాక్షారామ), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు సదరం ధ్రువీకరణ పత్రాలు ఇప్పిస్తానని వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిని శుక్రవారం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి సెక్యూరిటీ సూపర్‌వైజర్ పలివెల శ్రీనివాసరావు పట్టుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో మంగళ, శుక్రవారాల్లో నిర్వహించే సదరం క్యాంపునకు వచ్చే దివ్యాంగులకు ధ్రువీకరణ పత్రాలు చేయిస్తానని ఎం.రవికుమార్ అనే వ్యక్తి వసూళ్లకు పాల్పడుతూ మోసగిస్తున్నాడు. దీనిపై ఫిర్యాదులు రావడంతో ఆ వ్యక్తిని ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ ప్రవీణ్ వద్దకు తీసుకెళ్లగా ఆయన గట్టిగా నిలదీశారు. మంత్రి, తాము ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తుంటే వైద్యుల పేరుచెప్పి సొమ్ములు వసూలు చేస్తూ ఆసుపత్రికి చెడ్డపేరు తెచ్చేలా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పోలీసులు, మంత్రి సుభాష్ దృష్టికి డాక్టర్ ప్రవీణ్ తీసుకువెళ్లారు. పోలీసులు, మంత్రి సుభాష్ తండ్రి సత్యం రవికుమార్‌ను హెచ్చరించి వదిలిపెట్టారు. ఏరియా ఆసుపత్రి సమీపంలో మళ్లీ కనిపిస్తే కేసు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

ఉచిత న్యాయ సేవలకు డయల్ 15100

నేడు జీఎస్‌కెలో న్యాయసేవాదినోత్సవం: డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాష్‌బాబు



రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): న్యాయపరంగా ఎవరికైనా ఇబ్బందులు ఏర్పడితే టోల్‌ఫ్రీ నెంబరు 15100ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణంలో డీఎల్ఎస్ఏ భవనంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక జీఎస్‌కే న్యాయ కళాశాలలో ఈనెల 9న జిల్లా న్యాయ సేవా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించడం దీని ముఖ్యోద్దేశమన్నారు. ఉచిత న్యాయసహాయం అవసరమైన వారికి సలహాలు, మధ్యవర్తిత్వం, సామరస్యం ద్వారా కేసులు పరిష్కరించేందుకు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో న్యాయసేవాధికార సంస్థలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సుప్రీంకోర్టు, హైకోర్టు, జిల్లా కోర్టుల్లో పేదవాడికి న్యాయాన్ని అందించే దిశగా పారా లీగల్ వలంటీర్లు, ప్యానల్ లాయర్లు, అత్యున్నత స్థాయిలో ఉన్న న్యాయవాదులు కొంత ఫీజును కూడా తగ్గించుకొని పేదల కోసం వాదిస్తారని చెప్పారు. కాగా వచ్చే నెల 14న జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని ప్రకాష్‌బాబు తెలిపారు. ఇందులో క్రిమినల్, సివిల్, యాక్సిడెంట్, కుటుంబ వివాదాలు, చిట్ ఫండ్స్ వివాదాలు, బ్యాంకు లావాదేవీల కేసులు, టెలిఫోను బకాయిలు, మునిసిపల్ ఆస్తి, నీటి పన్నుల కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవచ్చని చెప్పారు.

సోషల్ మీడియా సైకోలను ఉపేక్షించం

ఎమ్మెల్యే నల్లమిల్లి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అప్పటి ప్రతిపక్ష నేతలపైనా వారి ఇంట్లో మహిళల పట్ల అసభ్య పదజాలంతో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన ఎవరినీ ఉపేక్షించబోమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం అనపర్తిలోని ఎన్డీయే కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలకులు నియోజకవర్గంలోని టీడీపీ కార్యకర్తలపై 185 అక్రమ కేసులు, తనపై 39 అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారన్నారు. ఐదేళ్ల పాలనలో వారు చేసిన అవినీతికి ఇప్పుడు అధికారులు బలవుతున్నారన్నారు. అప్పటి అనపర్తి డీటీ సస్పెండ్ కాగా రంగంపేటలో ఐదుగురు అధికారులు బలికాబోతున్నారన్నారు. బలభద్రపురంలో ఊర చెరువు అభివృద్ధిలో జరిగిన అవినీతి మొత్తాన్ని అధికారులకు ఆపాదించాలని చూస్తున్నారని, చెరువు పనుల్లో ఎవరి అవినీతి ఎంతో త్వరలోనే తేలుస్తామన్నారు. అలాగే అనపర్తి మండలంలో భూసేకరణ పేరుతో రూ.8 మేర అవినీతికి పాల్పడ్డారని దీ నిపైనా విచారణ జరుగుతుందన్నారు. సమావేశంలో సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, పడాల వెంకటరామారెడ్డి, ఒంటిమి సూర్యప్రకాష్, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, దత్తుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త మొక్కు తీర్చిన ఎమ్మెల్యే నల్లమిల్లి

బిక్కవోలు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గెలవాలంటూ మండలంలోని బలభద్రపురం గ్రామానికి చెందిన చప్పా శ్రీను కుమారుడు అరుణ్ 108 కొబ్బరికాయలు కొట్టిస్తామనని మొక్కుకోగా ఆ మొక్కును రామాలయంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు శుక్రవారం తీర్చారు. కార్తీక మాసం సందర్భంగా ఉమా రామాలింగేశ్వరస్వామి ఆలయంలో వేప చెట్టు, రావిచెట్టుకు ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారిని గ్రామస్థులు సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బుంగా రామారావు, నాయకులు నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, రావాడ నాగు, దత్తుడు శ్రీను, పడాల వెంకటరామారెడ్డి, గొర్రెల త్రిమూర్తులు, సలుమూరి శ్రీను పాల్గొన్నారు.

సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలి



విశ్లేషణాత్మక సదస్సు చిత్రపటాన్ని వివరిస్తున్న వ్యవసాయ విద్యార్థినులు

రంగంపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక వ్యవసాయ శాస్త్ర సాంకేతిక విజ్ఞానంపై అవగాహన పెంచుకొని అధిక దిగుబడులు సాధించడానికి చంద్రేడు సర్పంచ్ జాస్తి వెంకట పద్మావతి సూచించారు. శుక్రవారం శ్రీకాకుళం జిల్లా నైరా వ్యవసాయ కళాశాల అధ్యయన విద్యార్థినులు, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయాధికారుల పర్యవేక్షణలో నిర్వహించిన గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక సదస్సు చిత్రపటం, వివరణ అవగాహన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. రైతులు అధిక మోతాదులో ఎరువులు, పురుగుమందులు వాడకం తగ్గించి, ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కషాయాలు, ఘన, ద్రవ జీవామృతులు వాడాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు సీహెచ్ఎన్వీ నరసింహారావు, ఎం.శ్రీనివాసరావు, ఏవో కె.శ్రీనివాస్, నాయకులు రాయుడు మురళీకృష్ణ, మద్దిపూడి సత్తిబాబు, కంటిపూడి సూరిబాబు పాల్గొన్నారు.

వైద్యరంగంలో సిమ్యులేషన్ పాత్ర కీలకం

డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ నరసింహం



జ్యోతి ప్రజ్వలనలో వీసీ నరసింహం తదితరులు

రాజానగరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైద్య పాఠ్యాంశాలకు, చికిత్సలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడంలో మెడికల్ సిమ్యులేషన్ విశేషంగా ఉపయోగపడుతుందని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ డీఎస్వీఎల్ నరసింహం అన్నారు. రాజానగరం సమీపంలోని జీఎస్ ఎల్ మెడికల్ కళాశాలలో ఎస్‌హెచ్ఎస్(సొసైటీ ఫర్ హెల్త్ కేర్ సిమ్యులేషన్)సంస్థ నిర్వహిస్తున్న 5వ వార్షిక సమ్మేళనం రెండో రోజు శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మెడికల్ సిమ్యులేషన్ సంప్రదాయ వైద్య విద్యల బోధనా పద్ధతుల నుంచి ఇమర్సివ్, పేషెంట్ భద్రతా ట్రీట్మెంట్ సామర్థ్యం లక్ష్యాలపై దృష్టి సారించి నేర్చుకోవడం కొత్తవిధానంగా చెప్పారు. దీనిలో భాగంగా డాక్టర్ గన్ని భాస్కరరావుకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందించారు. దేశవ్యాప్తంగా సిమ్యులేషన్ సెంటర్లు స్థాపించి, గ్లోబల్ నిపుణులు, శస్త్రచికిత్స వైద్యులు, సిమ్యులేషన్ అభిరుచి గల వారిని సమీకరించినందుకు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రముఖ ఎనస్థీషియా వైద్యురాలు డాక్టర్ లులూ షరీఫ్, డాక్టర్ దినకర్‌పాయ్‌లను సత్కరించారు.

యువకుడి అదృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఆదెమ్మదిబ్బకు చెందిన 24 ఏళ్ల వి.సంతోష్ కనిపించడం లేదని అతని తండ్రి వెంకటేశ్వరావు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంతోష్ ఈనెల 7న తల్లితో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయాడని బయట, బంధువుల ఇంట వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు ఆభరణాల చోరీ

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం జాంపేటకు చెందిన వి.మంగతాయారు నివాసంలో రెండున్నర కాసులు బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. బాధితురాలి కథనం ప్రకారం.. మంగతాయారు గత నెల 20, 21 తేదీల్లో ఇంట్లో పనులు చేయించడానికి ఇద్దరిని పెట్టుకున్నారు. వారు ఇంట్లో పనులు చేసి వెళ్ళిపోయారని అప్పటి నుంచి ఇంట్లో పెట్టిన బంగారు అభరణాలు చూసుకోలేదని అటుపై చూసుకుంటే కనిపించలేదని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నరసింహస్వామి

మెట్ల దీపోత్సవం

కోరుకొండ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీకమాసం సందర్భంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి మెట్ల దీపోత్సవం వారం రోజులుగా ప్రతి రోజు రాత్రి శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కుటుంబ సభ్యులు స్వామివారి మెట్ల దీపోత్సవంలో పాల్గొని కొండ దిగువన స్వామివారి పాదాల వద్ద ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చక స్వాములు వాడపల్లి నాగు అచార్యులు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో పూజలు చేయించారు. అనంతరం ముందుగా స్వామివారి పాదాల వద్ద దీపాలు వెలిగించారు. అనంతరం స్వామి వారి కొండ 650 మెట్లకు ఇరువైపులా దీపాలు వెలిగించారు. కొండపై ఆలయం చుట్టూ కార్తీక దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి దొర, కర్రి వీరగణేష్, చిట్టిబాబు, ఎమ్మెల్యే కుమార్తె తోట ప్రత్యూషదేవి, పవన్‌కుమార్, బత్తుల వందనాంబిక, బత్తుల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కాగా నరసింహస్వామి సన్నిధిలో జరుగుతున్న కార్తీక అన్న సమారాధనకు తిరుమల విద్యాసంస్థల అధినేత నున్న తిరుమలరావు రూ.లక్ష విరాళాన్ని కమిటీ సభ్యులకు కటకం చలం, కర్రి వీరగణేష్, రొంగల శ్రీను, బదిరెడ్డి దొరలకు అందజేశారు.

హాస్టల్ చూస్తే హడల్

పెచ్చులూడుతున్న శ్లాబు.. చలికి వణుకుతున్న విద్యార్థులు

» శిథిలావస్థలో గోకవరం ఎస్సీ బాలుర వసతి గృహం

» ఇబ్బందుల్లో స్టూడెంట్స్





గోకవరంలోని ఎస్సీ బాలుర హాస్టల్, పెచ్చులూడిన శ్లాబు



హాస్టల్ ఆవరణలో నిల్వ ఉన్న మురుగునీరు

గోకవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం వసతి గృహల ఆలనా పాలనను పూర్తిగా విస్మరించడంతో ఇప్పుడు వాటి పరిస్థితి కడుదయనీయంగా మారింది. అసౌకర్యాల నడుమ పలు హాస్టల్స్ ప్రస్తుతం కొట్టిమిట్టాడుతున్నాయి. శిథిలావస్థకు చేరుకున్న భవనాల్లో విద్యార్థులు, నిర్వాహకులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. మండల కేంద్రమైన గోకవరంలోని ఎస్సీ బాలుర వసతి గృహం (హస్టల్) దుర్భర స్థితిలో ఉంది. భవనం శిథిల స్థితికి చేరుకుంది. శ్లాబు పెచ్చులు పెచ్చులుగా ఊడిపోయి విద్యార్థులపై పడుతున్నాయి. అసలే చలికాలం కావడంతో పిల్లలు చలికి వణుకుతున్నారు. డార్మెటరీలోకి వర్షపు నీరు చేరుతుండడంతో వారు రాత్రుళ్ల కంటిమీద కునుకు లేకుండా తెల్లవార్లూ జాగారం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ట్రంకు పెట్టెలను వర్షపు నీటి నుంచి కాపాడుకోవడానికి విద్యార్థులు అనేక వ్యయప్రయాసలు పడుతున్నారు. వరండాలో నిర్వాహకులు(వార్డెన్, సిబ్బంది) పెద్ద పెద్ద పళ్లాలు(బేసిన్‌లు) ఏర్పాటు చేసి విద్యార్థుల అవస్థలను కొంతమేర తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నారు. వసతిగృహం ప్రాంగణం పల్లంగా ఉండడంతో వర్షపు నీరంతా రోజుల తరబడి లోపలే నిల్వ ఉండిపోతుంది. దీంతో విద్యార్థులు నానా అగచాట్లు పడుతున్నారు. బురదనీటిని తప్పించుకొని మరుగుదొడ్డికి వెళ్ళాలన్నా, హస్టల్ నుంచి బయటకు, లోపలికి తిరగాలన్నా అష్టకష్టాలు పడాల్సిందే. ప్రస్తుతం ఈ వసతిగృహంలో సుమారు 107 మంది విద్యార్థులు ఉంటున్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వం హస్టళ్లలో మౌలిక సదుపాయాలను త్వరగా ఏర్పాటుచేయాలని పలువురు కోరుతున్నారు.

డిసెంబరు 1న బాలల

కథా రచన పోటీలు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 8,(ఆంధ్రజ్యోతి): బాలమందిరం,గోదావరి బాలోత్సవం సంయుక్త ఆధ్వ ర్యంలో వచ్చే నెల 1న రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ఇంగ్లీషు మీ డియం స్కూల్‌లో బాలల కథా రచనల పో టీలు నిర్వహిస్తున్నామని గోదావరి బాలోత్సవం అసోసియేట్ అధ్యక్షుడు వీఎస్ఎస్. కృష్ణకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ తులసి తెలిపారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 4 నుంచి 10వ తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఈనెల 25వరకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్లకు 99631 63136, 94922 49377 నెంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన 80 కథలను బాలల కథా సంపుటి 2025 పేరుతో ఒక పుస్తకం రూపంలో ముద్రించి జనవరిలో ఆవిష్కరించాలని ప్రయత్నిస్తున్నామన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు మల్లికార్జునరావు, నవీనకుమారి, అంజలి, జాస్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రాజ్యాంగ దినోత్సవం

కరపత్రం ఆవిష్కరణ

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 8,(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం ఆమోదించిన నవంబరు 26ను జాతీయ రాజ్యాంగ దినోత్సవంగా జరపాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో దానికి సంబంధించి స్థానిక ఎస్సీ సంఘాల నేతలు ముద్రించిన కరపత్రాలను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్ ఆవిష్కరించారు. రాజమహేంద్రవరంలోని మంత్రి నివాసంలో శుక్రవారం ఎస్సీ ఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకులు కలిశారు. ఈ కార్య క్రమంలో ఎస్సీ ఎస్టీ ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు కోరుకొండ చిరంజీవి, నాయకుల తాళ్ళూరి బాబు రాజేంద్రప్రసాద్, టీడీపీ ఎస్సీసెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ దారా యేసురత్నం,నాయకులు ఎంపీడీ కృపావరం, ఉసురుమర్తి రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మరణాలపై

విచారణ జరపాలి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 8,(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లాలో విద్యార్థులు పౌష్టికాహారం లోపం, సకాలంలో వైద్యం అందని కారణంగానే మరణిస్తున్నారని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేడంగి చిట్టిబాబు ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి విచారణ జరిపించాలని కోరారు.

నేడు, రేపు అండర్-17 బాలుర

బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలో ఈనెల 9, 10 తేదీల్లో 68వ ఆంధ్రప్రదేశ్ అంతర్‌జిల్లాల స్కూల్స్ అండర్ - 17 బాలుర ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి వాసు దేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వేదికగా పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీల్లో 13 జిల్లాల నుంచి 13 టీమ్‌లు పాల్గొంటాయని పేర్కొన్నారు.

డీఏ బకాయిలు చెల్లించాలి

విశ్రాంత ఉద్యోగుల సమావేశం

దేవరపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన డీఏ, డీఆర్, పీఆర్సీ ఏరియర్స్ వెంటనే మంజూరు చేయాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడు ఎస్‌కే.ఆలీ అన్నారు. దేవరపల్లిలో శుక్రవారం నిర్వహించిన విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పింఛనుదారులకు ఫ్యామిలీ పింఛన్లు, లైఫ్ సర్టిఫికెట్లు వెంటనే అందజేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు కేసిరాజు సీతారామయ్య, ఈడ్పుగంటి నాగేశ్వరారావు, యలమాటి సత్యనారాయణ, బి.సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

సుపరిపాలన అందించాలన్నదే లక్ష్యం

» చక్రద్వారబంధంలో 'జనవాణి'.. అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే బత్తుల



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలకు సుపరిపాలన అందించాలన్నదే తమ లక్ష్యమని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. చక్రద్వారబంధంలో జనవాణి కార్యక్ర మాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రజల నుంచి అర్జీల రూపంలో స్వీకరిస్తున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కాగా జనవాణిలో గ్రామంలో తాగునీటి ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం కల్పించాలని, నివాస స్థలాలు ఇప్పించాలని, రేషన్ కార్డులు, పించన్ల మంజూరు, వీధి లైట్లు, రీసర్వే సమస్యలు పరిష్కరించాలని, పోస్టాఫీసును పాత పంచాయతీ భవనంలోకి తరలించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞాపనలు అందజేశారు. అలాగే దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇప్పించాలని, రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. మండలం వ్యాప్తంగా వచ్చిన అర్జీలను ఎమ్మెల్యే స్వీకరించారు. సమస్యలపై సంబంధిత అధికారులతో సంప్రదించి, సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

కమ్యూనిజంతోనే సమానత్వం

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు వనజ



సమావేశంలో మాట్లాడుతున్న అక్కినేని వనజ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజలంతా ఒక్కటిగా బతికే సమానత్వం ఒక్క కమ్యూనిజంతోనే సాధ్యమని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. రాజమహేంద్రవరం సీపీఐ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సీపీఐ జిల్లా సమితి సమావేశంలో ఆమె మాట్లాడారు. జార్ఖండ్‌లో ఏకరూప పౌరస్మృతి నుంచి గిరిజనులను ఎందుకు మినహాయించారో హోం మంత్రి అమిత్‌షా చెప్పాలన్నారు. గిరిజనుల హక్కులు, ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేశారు.సీపీఐ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని వాడవాడలా సంబరాలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, నాయకులు కొండలరావు, జ్యోతిరాజు, శ్రీనివాస్, లక్ష్మణ్, సప్ప రమణ, లావణ్య, నౌరోజీ తదితరులు పాల్గొన్నారు.

ఏఐతో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

బెంగళూరులోని కరిష్మా కార్పొరేషన్ చైర్మన్ అండ్ సీఈవో రాజ్ మృత్యుంజయప్ప



సదస్సులో మాట్లాడుతున్న మృత్యుంజయప్ప

రాజానగరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ద్వారా విప్లవాత్మక మార్పులు రానున్నాయని బెంగళూరులోని కరిష్మా కార్పొరేషన్ చైర్మన్ అండ్ సీఈవో, ఇండో-అమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ డాక్టర్ రాజ్ మృత్యుంజయప్ప అన్నారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో (జీజీయూ)లో జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)చాట్‌జీపీటీ అనువర్తనాలపై జాతీయ స్థాయి సదస్సు కులపతి కేవీవీ చైతన్యరాజు అధ్యక్షతన శుక్రవారం ప్రారంభించారు. దీనికి మృత్యుంజయప్ప ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. చైతన్యరాజు మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ప్రపంచంలో విద్యార్థులు నిలదొక్కుకోవడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. వైస్ చాన్సలర్ కె.శశికిరణ్ వర్మ మాట్లాడుతూ ఏఐ శక్తివంతమైన ప్రభావాన్ని వివరించారు. ఉపకులపతి యు.చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు, పరిశ్రమల మధ్య ఉత్పాదక చర్యలను ప్రోత్సహించి, విద్యావిభాగంలో ఏఐ సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంటినెంటల్ ఇండియా సీఈవో ప్రసాద్ దొరస్వామి, సదస్సు సమన్వయకర్తలు బి.సుజాత, ఆర్.తమిళకోడి, వల్లీమాధవి, సీఈవో శిశిధర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అచ్చెన్నాయుడును కలిసిన నర్సరీ సంఘం



మంత్రి అచ్చెన్నాయుడితో నర్సరీ సంఘం నాయకులు

కడియం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సర్ఆర్థర్ కాటన్ నర్సరీ పార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడును విజయవాడలోని ఆయన కార్యాలయంలో కలిశారు. నర్సరీ రైతుల సమస్యలను వివరించి వినతి పత్రం అందజేశారు. నర్సరీ రైతులకు సోలార్‌మోటార్లను, అలానే ట్రాలీలు, స్ప్రేయర్లు, షేడ్‌నెట్లు, విడ్‌మెట్లు, పాలీ హౌస్‌లను సబ్సిడీ ద్వారా అందించాలని కోరారు. బ్యాంకు రుణాల ప్రాసెస్, రెన్యూవల్ చార్జీలు అధికంగా పడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నర్సరీ రైతుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జంగా సుబ్బారావు, తాడాల నాగేశ్వరరావు, గాజుల రత్తయ్య, పిల్లా శ్రీనివాస్, మల్లు శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

15 వరకు పోస్టల్ ఖాతా ప్రత్యేక క్యాంపులు

గోపాలపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆయా పథకాలు లబ్ధిదారుల ఖాతాలో నేరుగా అందించేందుకు తపాలా శాఖ చర్యలు తీసుకుంటుందని తాడేపల్లిగూడెం డివిజన్ తపాల శాఖ సూపరింటెండెంట్ కృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, తపాలా శాఖ సంయుక్తంగా ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ఖాతాలను ప్రారంభిస్తోందన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించి గ్రామసచివాలయ స్థాయిలో శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. 2.50లక్షల ఖాతాలను పునరుద్ధరించ డం, కొత్తఖాతాలను తెరవనున్నట్టు పేర్కొన్నారు. డివిజన్ పరిధిలో 229 పోస్టాఫీ సుల ద్వారా ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాజవోలులో టీడీపీ సభ్యత్వ నమోదు మండల ఇన్‌చార్జి మచ్చేటి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. గ్రామాధ్యక్షుడు నిమ్మపూడి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో గాలి వెంకటేశ్వరరావు, చాపల వెంకట్రావు, వల్లూరి శ్రీరామ్‌చౌదరి, ఎం.నాగేశ్వరరావు, ఎ.రాజు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలి

తహశీల్దార్‌కు 104 సిబ్బంది వినతి



వినతిపత్రం అందిస్తున్న 104 సిబ్బంది

రంగంపేట,నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) :తమ డిమాండ్ల పరిష్కరించాలని రంగంపేట 104 సిబ్బంది తహశీల్దార్ ఉండవిల్లి రంజిత్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా 104 ఉద్యోగులు మాట్లాడుతూ మూడు నెలల వేతనం చెల్లించాలని, మూడేళ్ల నుంచి ఇవ్వని ఇంక్రిమెంట్లను తక్షణమే ఏరియర్స్ రూపంలో చెల్లించాలని కోరారు. అలాగే 104 సర్వీసులను ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ద్వారానే నిర్వహించాలని, వాహనాలకు ఫిట్‌నెస్ బీమా వెంటనే చేయించాలని కోరారు. వీటితోపాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో 104 సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేట్ల రాంబాబు, డ్రైవర్‌లు గొర్రెల కాంతారావు, పి.హరి డేటాఎంట్రీ ఆపరేటర్లు బత్తిన అనిల్‌కుమార్, జి.మోహన్, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

సీతానగరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదంలో ఇల్లు కోల్పోయిన కుటుంబానికి శుక్రవారం మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ కుమారుడు పెందుర్తి అభిరామ్ రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. సింగవరం గ్రామానికి చెందిన చిట్రోతు సీతారత్నంకు చెందిన ఇల్లు అగ్నిప్రమాదానికి గురై కాలిపోయింది. దీంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు.

సభ్యత్వ నమోదులో అనపర్తిని

అగ్రగామిగా నిలపాలి

టీడీపీ ఇన్‌చార్జి మనోజ్‌రెడ్డి

అనపర్తి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో అనపర్తి నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలపాలని పార్టీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రామవరంలో ఆయన పర్యటించి సభ్యత్వ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలోను నాయకులు, కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో పర్యటించి సభ్యత్వ నమోదు వేగంగా జరిగే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో తేనెల శ్రీనివాస్, చింతా సురేష్‌రెడ్డి, నల్లమిల్లి సుబ్బారెడ్డి, సత్య, కర్రి చిన్నారెడ్డి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



గోకవరంలో జరుగుతున్న న్యాయ విజ్ఞాన సదస్సు

గోకవరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): చట్టాల పట్ల మహిళలు పూర్తి అవగాహన కల్గి ఉండాలని జడ్జి కె.ప్రకాష్‌బాబు అన్నారు. స్థానిక ఐకేపీ మండల సమాఖ్య భవనంలో శుక్రవారం నిర్వహించిన మహిళా న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన విచ్చేసి మహిళల హక్కులు, తదితర అంశాలను వివరించారు. కోరుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో సీనియర్ అడ్వకేట్‌లు పద్మావతి, సుజాత, డీసీపీవో రాజ్‌కుమార్, సీడీపీవో పి.వరలక్ష్మి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు

రోషిణి ఎంపిక



చాగల్లు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌బాల్ అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు చాగల్లు హైస్కూల్ విద్యార్థిని రోషిణి ఎంపికయ్యింది. శని, ఆది, సోమవారంలలో విజయవాడలో జరిగే పోటీలోల పాల్గొంటుంది. గత నెలలో ఏలూరులో జరిగిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యింది. ఈ సందర్భంగా శుక్రవారం హైస్కూల్లో జరిగిన కార్యక్రమలో ప్రధానోపాధ్యాయుడు పి.వీర్రాజు, శిక్షణ ఇచ్చిన విజయక్ష్మి, విద్యాకమిటీ అధ్యక్షుడు గోపాలకృష్ణ తదితరులు రోషిణిని అభినందించారు.




ఏలేరు వాగులో తేలిన మృతదేహం

ఊపిరి తీసిన ఉపాధి!

ఉపాధి ఊపిరి తీసింది.. నలుగురి ప్రాణాలు బలిగొంది. ఇసుక గుంతలు ఎంత ప్రమాదకరమో చెప్పకనే చెప్పింది.. అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలం బొంగరాలపాడులో ఉన్న ఏలేరు వాగులో ఇసుక తీతకు నలుగురు కూలీలు వెళ్లారు.. ఉదయం అంతా పనిచేశారు.. మధ్యాహ్నం సమయానికి మరింత లోతుకు వెళ్లారు.. అయితే నలుగురిలో ఒకరు ముందుకు వెళ్లగా ఇసుక గుంతలో పడి కొట్టుకుంటున్నాడు.. ఇది గమనించిన మరో ఇద్దరు అతన్ని కాపాడేందుకు ముందుకెళ్లారు.. ఆ ముగ్గురు లోపలకు వెళ్లిపోతుండగా మరొకరు గమనించి పట్టుకున్నారు.. ఇలా ఒకరి వెంట మరొకరు.. నలుగురు గల్లంతయ్యారు..ఈ నలుగురిలో ముగ్గురు ఒకే కుటుంబానికి చెందినవారు.. - వివరాలు 8లో



నీటి ఎద్దడి తీర్చకపోతే చర్యలు : చక్రద్వారబంధంలో రోడ్డుపై నిలబడి సిబ్బందితో చర్చిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఈ సీజన్‌లో నీరందించలేకపోవడం సిగ్గుచేటు!

- చక్రద్వారబంధంలో కలెక్టర్ ఆగ్రహం
- ఆంధ్రజ్యోతి కథనంతో పరుగులు

రాజానగరం,నవంబరు 8 (నవంబరు) : గ్రామస్తులందరికీ సమానంగా నీటిని సరఫరా చేసే దిశగా తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్‌డ బ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. నీళ్లు కావా లంటే..పని మానుకోవాల్సిందే! శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన కథనంపై కలెక్టర్ పి.ప్రశాంతి తక్షణమే స్పందించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకే కలెక్టర్ పి.ప్రశాంతి రాజానగరం మండలం చక్రద్వారబంధం గ్రామానికి చేరుకుని ఆకస్మికంగా సందర్శించారు.అధికారులు అందుబాటులో లేకపోవడంతో స్థానిక బోరు ఆపరేటర్‌తో మాట్లాడారు. ఈ సీజన్‌లో కూడా నీరందించలేకపోవడం సిగ్గుచేటని, ఎందుకు ఇవ్వడం లేదని బోర్‌వెల్ ఆపరేటర్ చక్రవర్తిని ప్రశ్నించారు.స్థానికుడు ముత్యం హరేరామకృష్ణ కలెక్టర్‌కు నీటి ఇబ్బందులను వివరించాడు. గ్రామంలో అనధికారిక కుళాయిలు అధికంగా ఉన్నాయని, మరికొన్ని కుళాయిలు నుంచి నీరు వృథాగా పోతున్నా పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదని తెలిపారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో అనధికారిక కుళాయిలను తొలగించాలని ఆపరేటర్‌ను ఆదేశించారు. హుటాహుటిన ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు బి.శ్రీనివాస్, టి.శ్రీనివాసబాబు, ఏఈ అవినాష్‌లు కలెక్టర్ వద్దకు చేరుకున్నారు. గ్రామంలో ఉన్న మూడు వాటర్ ట్యాంకులను అనుసంధానం చేస్తూ, వాల్వులు ఏర్పాటు చేసి గ్రామస్తులందరికీ సమానంగా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. చక్రద్వారబంధంలో ప్రజాసమస్యలపై వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి స్థానిక హరేరామకృష్ణ ఫోన్ నంబర్‌ను, కలెక్టర్‌తో అనుసంధానం చేయాలని అధికారులకు సూచించారు. ఏసమస్య ఉన్నా అధికారుల దృష్టికి తీసుకెళ్లమన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామంలో నిల్వ మాంసం విక్రయాలు సాగుతున్నా యని చెప్పడంతో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ని ఫోన్‌లో సంప్రదించి చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ లక్ష్మీ లావణ్యకు సూచించారు.పంచాయతీ కార్యదర్శి సత్యవాణి అందుబాటులో లేకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు కస్తూర్బాగాంధీ ఆశ్రమ శత వార్షికోత్సవం

సీతానగరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సీతానగరం కస్తూర్బాగాంధీ శతవార్షికోత్సవాలు శనివారం నుంచి ప్రారంభిస్తున్నట్టు ఆశ్రమ ప్రతినిధి సుశీల శుక్రవారం తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా గాంధీ ఆశయ సాధనకు 9 నవంబర్ 1924న బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం ఈ ఆశ్రమాన్ని స్థాపించారన్నారు. గాంధీజి రెండుసార్లు ఈ ఆశ్రమాన్ని సందర్శించారన్నారు. ఆశ్రమం స్థాపించి శనివారానికి 100 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శత వార్షికోత్సవ వేడుకల స్మారం (జ్ఞాపిక) ఆవిష్కరణ,దక్షిణ సబర్మతి-గౌతమి సత్యాగ్రహ ఆశ్రమం అనునామకరణంతో గ్రంధావిష్కరణ,ఆశ్రమ నివాసుల విగ్రహాల ఆవిష్కరణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

రాజమహేంద్రవరం ఎస్‌బీ డీఎస్పీగా రామకృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఎస్‌బి డీఎస్పీగా బి.రామకృష్ణను నియమిస్తూ రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇందులో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం ఎస్‌డీపీవోగా విధులు నిర్వహిస్తున్న బి.రామకృష్ణను తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా బదిలీపై నియమించారు.

పవన్ దీక్షపై అనుచిత పోస్టింగ్ వన్‌టౌన్‌లో కేసు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 8,(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక సోషల్ మీడియా కేసు నమోదు చేశారు. జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఇటీవల తిరుపతి లడ్డూ కల్తీ విషయంలో చేపట్టిన దీక్షపై ప్రకాష్‌నగర్‌కు చెందిన కేబీఆర్ రాజుసోషల్ మీడియాలో అనుచితంగా పోస్టింగ్ పెట్టాడని, అలాగే కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలపై తప్పుగా ప్రజలకు ప్రచారం చేస్తూ సోషల్ మీడియాలో రీల్స్ పెట్టారని రాజమహేంద్రవరం 8వ డివిజన్ జనసేన ఇన్‌చార్జి అచ్చిరెడ్డి వీరనాగేంద్రప్రసాద్ వన్ టౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

14 ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణాలకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. 14 రోడ్లు 101 కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లు సంసిద్ధత వ్యక్తం చేశారు. దీనిలో జి.వేమవరం- గొర్రి పూడి రోడ్డు, కరప-ఇంద్రపాలెం- దోమాడరోడ్డు, గొల్లపాలెం-కుయ్యేరు రోడ్డు, మురమళ్ల-వెదుర్లంక- పోలవరం రోడ్డు, ముమ్మిడివరం -కాట్రేనికోనరోడ్డు, ముమ్మిడివరం-ముక్తేశ్వరంరోడ్డు, విశ్వేశ్వరాయపురం- దిండిరోడ్డు, చింతలపూడి బ్రిడ్జి- మల్కి పురం రోడ్డు, రాజమహేంద్రవరం - గోకవరం-ముగ్గళ్లరోడ్డు, రాజానగరం- వెస్ట్ గోనగూడెం రోడ్డు, రాపాడు- చిన కొండేపూడి రోడ్డు, రేపాక- చిన కొండేపూడి రోడ్డు, రాజుపాలెం- రామవరం రోడ్డు,ఏలేశ్వరం-జడ్డంగి రోడ్లు ఉన్నాయి. వీటిని నిర్మాణాలు జరగనున్నాయి. అమరావతిలో గురువారం జరిగిన ఉన్నతాధికారుల సమావేశంలో ప్రభుత్వ హామీతో కాంట్రాక్టర్లు ముందుకు వచ్చారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 14 రోడ్ల నిర్మాణాలు పనులు ప్రారంభం అవుతున్నాయని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ జి.కంఠు తెలిపారు. రూ.290 కోట్ల నిధులు కేటాయించగా 30 శాతం రాష్ట్రప్రభుత్వం వాటా,70 శాతం న్యూడెవలప్‌మెంట్ బ్యాంకు ప్రాజెక్టు నుంచి సమకూరింది.



తేల్చుకుందాం!

రచ్చకెక్కిన జిల్లా ఆడిట్ శాఖ

జిల్లా ఆడిట్ శాఖలో మామూళ్ల వివాదం రచ్చకెక్కింది.. అసలు ఏం జరిగిందో ఏమో కానీ.. ఆ శాఖ జిల్లా ఇన్‌చార్జి ఆడిట్ అధికారికి.. మిగిలిన ఉద్యోగుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా ఉంది. ఇదిలా ఉండగా 2021-22లో ఆడిట్ జరిగిన 90 పంచాయతీల రికార్డులను మళ్లీ ఆడిట్ చేయాలని జిల్లా ఆడిట్ అధికారిని కలెక్టర్‌కు లేఖ రాయడంతో అసలు వివాదం బయటపడింది. అసలు ఏం జరిగిందనే దానిపై రకరకాల వాదనలు వినిపిస్తున్నాయి. దీనిపై రాష్ట్ర ఆడిట్ డైరెక్టర్ విచారణకు ఆదేశించారు.

- లెక్కల్లో తేడాలు
- ఉద్యోగుల మధ్య వివాదం
- ఆధిపత్యపోరుతో సతమతం
- మామూళ్లే కారణమా?
- జిల్లా అధికారిణిపై తిరుగుబాటు
- కలెక్టర్‌కు ఆడిట్ అధికారి లేఖ
- 90 పంచాయతీల్లో రీఆడిట్
- కుదరదంటున్న పాలకవర్గాలు
- గ్రామాల్లో గందరగోళం
- 12న జేడీ ఎంక్వయిరీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లా ఆడిట్ ఆఫీసులో ఆధిపత్య పోరుతో గందరగోళం ఏర్పడింది.జిల్లా ఆడిట్ అధికారి తమను వేధిస్తున్నారని మిగతా ఉద్యోగులంతా ఆమెపై తిరుగుబాటు చేశారు. 2023 మే నుంచి ఒకరింటే ఒకరికి పడని పరిస్థితి ఉండడంతో ఆడిట్ పనులు నిలిచిపోయాయి.ఈ నేపథ్యంలో పాత ఆడిట్ రిపోర్టులను తిరగదోడే పరిస్థితికి వచ్చారు. దీంతో పలు వర్గాల్లో ఆందోళన నెలకొంది.

గతంలో బదిలీ చేసినా ఇక్కడే..

2022లో జిల్లాల విభజన తర్వాత రాజమహేంద్రవరం కేంద్రంగా జిల్లా ఆడిట్ కార్యా లయం ఏర్పడింది. అయితే జిల్లా ఆడి ట్ అధికారి నియామకం జరగలేదు.జిల్లా ఇన్‌చార్జి ఆడిట్ అధి కారిగా ఒకరిని ప్రభుత్వం నియమించింది. ఇక్కడ ఇద్దరు అసిస్టెంట్ ఆడిట్ అధికారులు (ఏఏవో)లు, 13 మంది సీనియర్ ఆడిటర్లు, ముగ్గురు జూనియర్ ఆడిటర్లు,ఇద్దరు అటెండర్లు ఉన్నారు. ఇన్‌చార్జి జిల్లా ఆడిట్ ఆఫీసర్‌గా పద్మజారాణి 2022 జూలై1న బాధ్యతలు స్వీకరించారు.2023 మేలో గుడివాడకు బదిలీ చేయగా కోర్టు నుంచి స్టే తెచ్చుకుని ఇక్కడే కొనసాగుతున్నారు.అప్పటి నుంచి ఆమెకు, సిబ్బందికి మధ్య పోరు మొదలైంది. జిల్లా ఆడిట్ కార్యాలయం పరిధిలో జిల్లాలోని 300 పంచాయతీలు, రాజమహేంద్రవరం కార్పొరేషన్, కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీలు, దేవస్థానాలు, మార్కెట్ కమిటీలు ఉంటాయి.ఆయా సంస్థల ఆదాయ వ్యయాలు ఆడిట్ చేసి డిపార్ట్‌మెంట్ డైరెక్టర్‌కు రిపోర్టు ఇవ్వాలి. ప్రతి ఏటా ఆడిట్ చేస్తారు. ఆడిట్‌కి వెళ్లిన అధికారులకు ఆయా సంస్థలు రాచమర్యాదలు చేస్తుంటాయి.రూ.లక్షల్లోనే మామూళ్లు ముట్టచెబుతుంటాయి. ఎందుకంటే అక్రమ ఆదాయాలకు సంబంధించి పక్క దారి పట్టించిన నిధులు ఉంటాయి. జిల్లా అధికారికి, ఇతర ఆడిటర్లు,ఉద్యోగుల మధ్య మామూళ్లు, తప్పులను కప్పిపుచ్చే వ్యవహారాల మధ్య సయోధ్య కుదరలేదని సమాచారం.ఈ నేపథ్యంలో జిల్లా అధికారితో పాటు,ఉద్యోగులు వేర్వేరుగా డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.ఈ నెల 12న ఆడిట్ జాయింట్ డైరెక్టర్ విచారణకు ఆదేశించారు.

చాలా కాలంగా గొడవలు..

ఆడిట్ కార్యాలయంలో చాలా గొడవలు జరిగినట్టు సమాచారం ఉంది. గొడవలు ముదరడంతో 2023 మే నెలలో జిల్లా అధికారి ఉద్యోగుల జీతాల బిల్లు పెట్టలేదు.అడిగితే అందరినీ జైలుకు పంపిస్తామని బెదిరించినట్టు కొందరి కథనం. గతేడాది జూన్‌లో ఉద్యోగులంతా అప్పటి జిల్లా ఎస్పీని కలిసి వినతి పత్రం కూడా ఇచ్చినట్టు సమాచారం.కొద్దినెలల కిందట ఏకంగా ఉద్యోగులంతా సుమారు 15 రోజులకు పైగా మూకుమ్మడి సెలవు పెట్టేసి ఆఫీసుకు రాలేదు. కేవలం జిల్లా అధికారి మాత్రమే హాజరయ్యేవారు.ఇలా వివాదం బాగా ముదరడంతో పాటు గతంలో ఆడిట్ చేసి అప్ లోడ్ చేసిన నివేదికలను తిరిగి రివ్యూ చేయాలనే ఆలోచనకు జిల్లా అధికారి రావడంతో, మరింత గందరగోళం ఏర్పడింది. ఈ నేపథ్యంలో అసలు ఇక్కడ ఏం జరుగుతుందో నిగ్గు తేల్చడానికి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.ఈ నెల 12న జాయింట్ డైరెక్టర్ స్థాయి ఆడిట్ అధికారి ఇక్కడకు విచారణ జరపనున్నారు.ఈ నేపథ్యంలో ఎవరికి వారు తమ తప్పులేదని చెప్పుకోవడానికి ఎత్తులు వేస్తున్నారు. మంగళవారం జరిగే విచారణలో ఏం జరుగుతుందోననేది ఆసక్తిగా మారింది.దీనిలో ఆడిట్‌లో అవకతవకలు బయటకు వస్తాయని అంచనా ఉంది.

కలెక్టర్‌కు ఫిర్యాదు

2021-22లో జిల్లాలోని అన్ని పంచాయతీల్లో ఆడిట్ జరిగింది. జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో ఆదాయ వ్యయాలను పరిశీలించి ప్రస్తుత జిల్లా అధికారి పద్మజారాణి సంతకం చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు.అంటే అప్పటికి ఆమె అభ్యంతరం చెప్పవలసినవి ఏమీ లేనట్టేనని అర్థం.అయితే ఇప్పుడు మళ్లీ జిల్లా వ్యాప్తంగా 90 పంచాయతీల్లో తిరిగి ఆడిట్ చేయవలసిన అవసరం ఉందంటూ ఈ నెల 1న జిల్లా ఆడిట్ అధికారి పద్మజా రాణి స్వయంగా కలెక్టర్ పి.ప్రశాంతికి లేఖ రాశారు. తాను గ్రామ పంచాయతీలకు సం బంధించిన 2021-22 సంవత్సరానికి ఆడిట్లను రివ్యూ చేయడానికి పంచాయతీ సెక్రటరీల నుంచి రికార్డులు కోరగా చూపించలేదని అందులో వివ రించారు. అనపర్తి, బిక్కవోలు, కోలమూరు సెక్ర టరీలను పలుదఫాలు కోరినా రికార్డులు చూపించలేదన్నారు.ఈ నేపథ్యంలో ఆడిట్లు ఆగిపోయాయని తెలిపారు.ఆడిట్లు పూర్తి చేయడానికి రికార్డులన్నీ చూపాలని ఆయా సెక్రటరీలను ఆదే శించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. జిల్లా కలెక్టర్ డీపీవోకు ఫార్వర్డ్ చేయగా ఆమె జిల్లాలోని 90 పంచాయతీలకు ఫార్వర్డ్ చేశారు.

రీ ఆడిట్‌పై ఆందోళన

2021-22 ఆడిట్‌ను తిరగదోడతామని చెప్పడంతో జిల్లాలోని 90 పంచాయతీ సెక్రటరీలు, పాలకవర్గాల్లో గందరగోళం నెలకొంది. తిరిగి ఆడిట్ చేయడానికి పంచాయతీ సర్పంచ్‌లు, సెక్రటరీలు ఒప్పుకోవడంలేదు. జిల్లా అధికారి మాత్రం ఆడిట్ జరగాలని పట్టుపడుతున్నారు. నిబంధనల ప్రకారం ఒకసారే ఆడిట్ చేయా లని, పైగా ఆమోదించిన అధికారే తిరిగి ఆడిట్ చేయడం ఏంటని సర్పంచ్‌లు, కార్యదర్శులు, అధికారులు,ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు.కానీ తిరిగి ఆడిట్ చేస్తే వారికొచ్చిన సమస్య ఏంటనేది మరో ప్రశ్నగా మారింది.అప్పట్లో వైసీపీ పాలకవర్గాలు ఎక్కువగా ఉండడం వల్ల తప్పులు దాచిపెట్టి జిల్లా అధికారి, ఆడిటర్లు ఒకటై నివేదికలు ఇచ్చి ఉంటారని.. ఇవాళ వారి మధ్య వివాదం రావడంతో ఈ విషయం తిరగదోడుతున్నట్టు ప్రచారం జరుగు తోంది. ఆడిట్ ఆపడానికి కొందరు ప్రయత్నాలు చేస్తున్నట్టుసమాచారం.ఈవోపీఆర్‌డీల ద్వారా రీ ఆడిట్‌కు సిద్ధం చేయిస్తున్నట్టు తెలి సింది.



90 పంచాయతీలివే..

ఆడిట్ జరపాలని కోరిన 90 పంచాయతీలు ఇలా ఉన్నాయి.దేవరపల్లి మండలంలోని దేవరపల్లి,యర్నగూడెం, చిన్నాయిగూడెం, బంధపురం,యాదవోలు, గౌరీపట్నం, పెరవలి మండలం ఖండవల్లి,గోపాలపురం మండలం గోపాలపురం,చిట్యాల, గుడ్డిగూడెం పంచాయతీలు ఉన్నాయి. ఉండ్రాజవరం మండలం పాలంగి, పసలపూడి, సూర్యారావుపాలెం, కె.సావరం ఉన్నాయి.తాళ్లపూడి మండలం అన్నదేవరపేట, మలకలకపల్లి,తిరుగుడుమెట్ట, పెద్దేవం, వేగేశ్వరపురం,పోచవరం,నల్లజర్ల మండలం అనంతపల్లి,తెలికిచర్ల,అనుమునిలంక, చీపురుగూడెం, చోడవరం ఈస్ట్, ప్రకాశరావుపాలెం పంచాయతీలు ఉన్నాయి.నిడదవోలు మండలం శెట్టిపేట, సమిశ్రగూడెం, కోరుమామిడి, తాడిమళ్ల, రావిమెట్ల, కంసాలిపాలెం, తిమ్మరాజుపాలెం ఉన్నాయి.చాగల్లు మండలం బ్రాహ్మణ గూడెం, చిక్కాల,నందిగంపాడు, కలవలపల్లి,చాగల్లు, ధర్మవరం, ఊనగట్ల పంచాయతీలు ఉన్నాయి. రంగంపేట మండలం రంగంపేట, నల్లమిల్లి, వీరంపాలెం,సీతానగరం మండలం చిన కొండేపూడి,రఘుదేవపురం, సీతానగరం, బొబ్బిల్లంక, ముగ్గళ్ల,సింగవరం, కూనవరం ఉన్నాయి. బిక్కవోలు మండలం బిక్కవోలు, బలభద్రపురం,కొంకుదురు, అనపర్తి మండలం కుతుకులూరు,మహేంద్రవాడ, అనపర్తి, కడియం మండలం కడియం, వేమగిరి, కడియపులంక, దుళ్ల గ్రామాలున్నాయి.కోరుకొండ మండలం గాడాల, కణుపూరు, జంబూపట్నం, మధురపూడి, వెస్ట్ గోనగూడెం, రాఘవపురం, కాపవరం, గాదరాడ పంచాయతీలున్నాయి. రాజమండ్రి రూరల్‌లోని రాజవోలు,బొమ్మూరు, హుకుంపేట, కోలమూరు,ధవళేశ్వరం రాజానగరం మండలం దివాన్‌చెరువు, చక్రద్వారబంధం, వెలుగుబంద, నరేంద్రపురం, కొండగుంటూరు, శ్రీకృష్ణపట్నం, కలవచర్ల,భూపాలపట్నం నామవరం, నందరాడ, సంపత్‌నగరం,కొత్త తుంగపాడు, పాతతుంగపాడు, రాజానగరం ఉన్నాయి.


భక్తి సమ్మేళనంలో మాట్లాడుతున్న దుర్గేష్

వివేకానంద, పరమహంసల బోధనలు ఆచరణీయం

భక్తి సమ్మేళనంలో మంత్రి దుర్గేష్

నిడదవోలు,నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వివేకానందుడు, రామకృష్ణ పరమహంసల జీవన విధానాన్ని యువత ఆకళింపు చేసుకుంటే భవిష్యత్తు బంగారమవుతుందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు లయన్స్ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన రామకృష్ణ, వివేకానంద భావ ప్రచార పరిషత్ 5వ భక్తి సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. నేటి సమాజంలో కొందరు యువత గంజాయి మత్తులో నిర్వీర్యం అయిపోతున్నారని వారి భవిష్యత్ నాశనం చేసుకుం టున్నారన్నారు. కాలాలు మారినా తరాలు మారినా వివేకానందుడి మాటలు సజీవంగా ఉంటాయన్నారు. ప్రతి విద్యార్థి రామకృష్ణ పరమహంస, వివేకానందుడి చరిత్రను చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వామి అక్షరాత్మనంద్‌జీ మహరాజ్, స్వామి హృదయానందజీ మహరాజ్, స్వామి సుకృతానంద్‌జీ మహరాజ్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, మునిసిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ,కొమ్మిన వెంకటేశ్వరరావు, సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆడైనా.. మగైనా ఒక్కటే..

డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆడైనా, మగ అయినా ఒక్కటే అని గర్భస్థ పిండ లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా అమలు పరిచే గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం (పీసీపీఎన్‌డీటీ యాక్టు) అమలుకు సంబంధించి నిర్వహించిన జిల్లాస్థాయి మల్టీమెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని స్కానింగ్ సెంటర్లన్నీ ఈ యాక్టు అమల్లోకి వస్తాయని, ఎవరైనా చట్టం ఉల్లంఘించి లింగ నిర్ధారణ పరీక్షలు వెల్లడిస్తే చర్యలు తప్పవని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పీఎంఎస్ఎంఎ, ఐసీడీఎస్ కన్వర్జెన్సీ సమావేశం, మండలస్థాయి సెర్ప్ మీటింగ్, అన్ని పబ్లిక్‌మీటింగ్స్‌లో దీన్ని ఒక అజెండాగా పెట్టి చట్టంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వని సొసైటీల అనుమతులు రద్దు చేస్తా

కలెక్టర్ ప్రశాంతి హెచ్చరిక

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 8,(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనుమతులు పొంది ఇసుక తవ్వకాలు ప్రారంభించని బోట్స్‌మెన్ సొసైటీలపై అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇసుక అందుబాటులో ఉండేలా 119 మంది బోట్స్‌మెన్ సొసైటీలకు అనుమతులివ్వడం జరిగిందన్నారు. వీటిలో ఇప్పటి వరకు సుమారు 30 సొసైటీలు మాత్రమే కార్యకలాపాలు నిర్వహిస్తుండడంపై అసహనం వ్యక్తం చేశారు. అనుమతులిచ్చిన ప్రతి ఒక్క సొసైటీ క్షేత్రస్థాయిలో తవ్వకాలు చేపట్టాలన్నారు. శనివారం రీచ్‌లు వారీగా క్షేత్రస్థాయిలో పర్యటించి బోట్స్‌మెన్ సొసైటీలతో మాట్లాడడం జరుగుతుందని చెప్పారు.బోట్స్‌మెన్ సొసైటీలు తవ్వకాలు చేపట్టకపోతే అనుమతులు రద్దుచేస్తామని హెచ్చరించారు. జిల్లాలో 13 ఓపెన్ రీచ్‌లకు ఆరుమాత్రమే పనిచేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలకు పెండ్యాల ,తీపర్రు, పందలపర్రు, వంగలపూడి ఓపెన్ రీచ్‌లను అం దుబాటులో ఉన్నాయన్నారు. వినియోగదారులు తగిన ఆధారాలతో ట్రాక్టర్ ద్వారా వచ్చి ఉచితంగా ఇసుక తీసు కెళ్లవచ్చన్నారు. సమావేశంలో ఆర్‌డీవోలు ఆర్ కృష్ణనాయక్, రాణి సుస్మిత, మైన్స్ ఏడీ ఫణిభూషణ్ రెడ్డి, డీటీవో ఆర్.సురేష్, భూగర్భ జల అధికారి వై.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉచిత ఇసుక దర్జాగా తీసుకెళ్లండి : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ/కొవ్వూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం కోటిలింగాల ఇసుక రీచ్‌లను కలెక్టర్ పి.ప్రశాంతి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.రేవుల్లో ఇసుక నిల్వలు, బుకింగ్ పాయింట్ వద్ద క్యూలైన్ తదితర వాటిని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రీచ్‌ల వద్ద 50 శాతం చొప్పున ఆన్‌లైన్ ఆఫ్‌లైన్‌లో ఇసుకను వినియోగదారులకి అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఇసుక రీచ్ స్థాయిని బట్టి రోజుకు కనీసం వెయ్యి నుంచి రెండు వేల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలు చేపట్టాలన్నారు. జిల్లాలో డీసిల్టేషన్, ఓపెన్ రీచ్‌ల ద్వారా కనీసం 30 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. అనుమతి లేని చోట నిల్వచేయడాన్ని గుర్తించి సుమారు 10 యూనిట్ల ఇసుకను సీజ్ చేశారు. సొసైటీలు పరిధులు దాటి ఇసుక నిల్వలు చేస్తున్నట్టు అధికారుల దృష్టికి రావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

డబ్బులు డిమాండ్ చేస్తే చర్యలు : జేసీ

డీసిల్టేషన్, ఓపెన్ ఇసుకర్యాంపుల్లో అదనంగా డబ్బులు డిమాండ్ చేసినవారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని జేసీ ఎస్.చిన్నరాముడు అన్నారు. శుక్రవారం కొవ్వూరు ఎరినమ్మ, వాడపల్లి ఇసుక ర్యాంపులను ఆకస్మిక తనిఖీ చేశారు. ర్యాంపులలో బోట్స్‌మేన్ సొసైటీ సభ్యుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉచిత ఇసుక పాలసీని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఇసుక రవాణాకు ముందుకొచ్చిన ఎల్ వన్ బిడ్స్ వేసిన ఏజన్సీస్ కార్యకలాపాలు నిర్వహించాలని, లేకపోతే ఎల్2కు కేటాయించడం జరుగుతుందన్నారు. జేసి వెంట కొవ్వూరు తహశీల్దార్ దుర్గాప్రసాద్ ఉన్నారు.


కొవ్వూరు ఎరినమ్మ ఘాట్ ఇసుక రీచ్‌లో పరిశీలన చేస్తున్న జేసీ చిన్నరాముడు, ఇతర అధికారులు

అక్రమ ఇసుక గుర్తింపు.. కేసు నమోదు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం కోటిలింగాలపేట సాండ్ పాయింట్ దగ్గరలో ఎటువంటి అనుమతులు లేని ఇసుకను, జేసీబీలను గుర్తించడం జరిగిందని ఆర్డీవో కృష్ణనాయక్ వెల్లడించారు.దాడుల్లో శుక్రవారం అక్రమ ఇసుక నిల్వలను గుర్తించామని తెలిపారు. ఎటువంటి అనుమతులు లేని సుమారు రెండు లారీల ఇసుక, జేసీబీలను గుర్తించి ఇసుకను సీజ్ చేయాలల్సిందిగా రెవెన్యూ అధికారులను ఆదేశించినట్టు పేర్కొన్నారు.వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసు నమోదు చేయాలని త్రీటౌన్ పోలీసులకు సూచించామన్నారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం

» పొగాకు రైతులతో సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి మాధవరావు

దేవరపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటల సాగకు వ్యవసాయ శాఖ ఎంతో ప్రోత్సాహం అందిస్తోందని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. దేవరపల్లిలోని పొగాకు బోర్డులో శుక్రవారం దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల రైతులతో సమావేశం, పోషకాహార భద్రత పథకం కార్యక్రమం పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ పొగాకు పండించే రైతులు ప్రత్యామ్నాయ పంటలైన ఆహార పంటలకు ప్రాధాన్యమివ్వాలని, చిరుధాన్యాలు సాగు చేయాలని సూచించారు. ఒకే పంటను ఎక్కువగా సాగు చేస్తే ఉత్పత్తి సామర్థ్యంతో పాటు భూసారం తగ్గుతుందన్నారు. ఇతర దేశాల్లో పొగాకు సాగు తగ్గడమే ఈ ఏడాది పొగాకు ధరలు అధికంగా ఉండడానికి కారణమని, ప్రతీసారి ఇదే ధర ఉంటుందని రైతులు భావించకూడదని దీనికి ప్రత్యామ్నాయంగా వాణిజ్య ఆహార పంటలు వేసుకోవాలని సూచించారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ సీహెచ్‌వీ నరసింహారావు మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలనుకునే పొగాకు రైతులు మొక్క జొన్న సీడ్ కంపెనీ నుంచి అగ్రిమెంట్ చేసుకోవాలని, అపరాల్లో కొత్తరకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రబీ వరి సాగుకు అనుకూలమైన రకాలను రైతులకు వివరించారు. పొగాకు సాగు చేసే నేలల్లో పచ్చిరొట్ట ఎరువులు వేస్తే భూసారం పెరుగుతుందన్నారు. రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రీయ ఎరువులు వాడి సాగులో ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. దేవరపల్లి ఉద్యానశాఖాధికారి రమేష్ మాట్లాడుతూ పొగాకుకు ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటలు సాగు చేసుకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రకాల రాయితీలు ఇస్తున్నాయన్నారు. జీఎల్‌కే ప్రసాద్ మాట్లాడుతూ పొగాకు పరిమితి మేరకే పండించాలని, పంటపై పురుగుమందు వాడకుండా సాగుచేస్తే ప్రపంచ మార్కెట్‌లో డిమాండ్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ జయరామలక్ష్మి, వేలం నిర్వహణాధికారి హేమస్మిత, మూడు మండలాల వ్యవసాయాధికారులు కె.విజయ్, రాజారావు, కమలరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణలో కృత్యాన్ని పరిశీలిస్తున్న కోనసీమ డీఈవో సలీంబాషా

విద్యార్థులతో మమేకమై బోధించాలి

అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఈవో సలీంబాషా.. ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ కేంద్రం సందర్శన

దివాన్‌చెరువు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులతో మమేకమై వారి స్థాయికి వెళ్లి విద్యా బోధన చేయాలని, అప్పుడే అభ్యసనా సామర్థ్యాలను చేరుకునే అవకాశం ఉంటుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఈవో షేక్ సలీంబాషా అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం కొండగుంటూరులో ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఆటపాటలతో కూడిన విద్యను అందించేందుకు ఎఫ్ఎల్ఎస్ శిక్షణ దోహదం చేస్తుందన్నారు. ఉపాధ్యాయులు చేస్తున్న యాక్టివిటీస్‌ను ఆయన స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. శిక్షణా కేంద్రం వెన్యూ ఇన్‌చార్జి పి.రాంబాబు ఉపాధ్యాయులు శిక్షణ పొందుతున్న విధానాన్ని డీఈవోకు వివరించారు. ఉపాధ్యాయుల నుంచి డీఈవోఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. డీఈవో వెంట కోనసీమ జిల్లా సమగ్ర శిక్షా సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, రాష్ట్ర పరిశీలకుడు అరవ ప్రభాకర్, ఏపీ ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ పి.సాయి వెంకటరమణ ఉన్నారు.

కూటి కోసం వెళ్లి..

కానరాని లోకాలకు..!

» ఒకరిని కాపాడబోయి... మునిగిపోయిన మరో ముగ్గురు...

» నలుగురి గల్లంతుతో రోడ్డునపడ్డ రెండు కుటుంబాలు

» ఇద్దరి మృతదేహాలు లభ్యం

» అల్లూరి జిల్లా అడ్డతీగల మండలం బొంగరాలపాడు ఏలేరు వాగులో ఇసుక తీస్తుండగా దుర్ఘటన

» కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం తూర్పులక్ష్మీపురం, తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం అన్నదేవరపేటల్లో విషాదఛాయలు

అడ్డతీగల/ఏలేశ్వరం/తాళ్లపూడి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలం బొంగరాలపాడులో ఏలేరు వాగు ఉంది. ఇక్కడ ఇసుక ర్యాంపునకు అనుమతి లేదు. అయినా అనధికారికంగా ఇసుకతీత జరుగుతుంటుంది. కొన్నాళ్ల క్రితం ఈ ప్రదేశంలో ఇసుక తవ్వకాలు జోరుగా జరిగాయి. దీంతో అక్కడ గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల వర్షాలకు ఆ ప్రాంతమంతా నీరు ఎక్కువగా చేరి ఆ గుంతలు బురదతో నిండి ఊబి మాదిరిగా మారాయి. ఈ నేపథ్యంలో ఆ వాగులో ఇసుక తీసే ప్రాంతంలో ప్రమాదకరంగా ఉంది.

గుంతలు గుర్తించక...

కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం తూర్పులక్ష్మీపురం గ్రామానికి చెందిన వీరమళ్ల భూషణం(60), అతడి కుమారుడు వీరమళ్ల జయబాబు(26), అతడి అల్లుడు తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన బేదంపూడి చిన్నగొంతియ్యతో పాటు తూర్పులక్ష్మీపురానికి చెందిన మరో వ్యక్తి చింతా శ్రీనివాస్(19) కూలి పనులు చేస్తుంటారు. తూర్పులక్ష్మీపురం గ్రామానికి అడ్డతీగల మండలం బొంగరాలపాడు ఏలేరు వాగు దగ్గర్లోనే ఉంటుంది. అక్కడ ఇసుక తవ్వకం పనులకు వెళ్లి ఉపాధి పొందుతుంటారు. ఇసుక తవ్వి దాన్ని ట్రాక్టర్లలో లోడింగ్ చేసి పరిసర ప్రాంతాలకు తరలించే పని చేస్తుంటారు. అలా శుక్రవారం కూడా అదే మాదిరిగా ఇసుకతీత పనినిమిత్తం అక్కడకు చేరుకున్నారు. కానీ, అక్కడ గుంతలు ఏర్పడిన విషయం గ్రహించలేకపోయారు. మధ్యాహ్నం ముగ్గురూ ఇసుక తీత కోసం వాగులోకి దిగారు. ఒడ్డునే ట్రాక్టర్ కూడా ఉంది. అక్కడ కొంత ఇసుక తవ్వి కొంత లోడింగ్ చేశారు. మధ్యాహ్నం 3గంటల సమయంలో మళ్లీ వాగు లోపలికి వెళ్లగా తొలుత ఒకరు ప్రమాదవశాత్తూ లోపలికి మునిగిపోతున్నారు. అతడ్ని కాపాడే ప్రయత్నంలో మరొకరు.. తర్వాత ఇంకొకరు ఇలా నలుగురూ వాగులో మునిగిపోయారు. అంతా క్షణాల్లో జరిగిపోయింది. ఒకరిని కాపాడేందుకు వెళ్లి మరో ముగ్గురు కలిసి మొత్తం నలుగురు గల్లంతయ్యారు. ఇది చూసిన ప్రత్యక్ష సాక్షులు ఒక్కసారిగా హతాశులయ్యారు. ఇసుక తవ్వకాలకు వెళ్లి గల్లంతైన నలుగురు పేద కుటుంబానికి చెందినవారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే తూర్పులక్ష్మీపురం నుంచి బంధువులు, గ్రామానికి చెందిన పలువురు అడ్డతీగల మండలం బొంగరాలపాడు సంఘటనా స్థలానికి బయలుదేరి వెళ్లిపోయారు. సాయంత్రానికి తిరిగి వచ్చేస్తానని చెప్పిన వారు ఇలా కనపడకుండా పోవడంతో వారు రోదిస్తున్న తీరు కంటతడి పెట్టించింది.



మునిగిపోయిన వారి కోసం వలలు వేసి గాలిస్తున్న దృశ్యం

బావ, బావమరుద్దుల మృతదేహాల వెలికితీత

సమాచారం అందుకున్న పోలీసులు, డివిజన్ అధికారులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వీరిలో రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ, డీఎస్పీ సాయిప్రశాంత్ పరిసరాలను పరిశీలించి



రోదిస్తున్న బంధువులు

ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో గాలింపు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వెంటనే ఆయా బృందాలు రంగంలో దిగి వలల సహాయంతో వీరమళ్ల జయబాబు, బేదంపూడి గొంతియ్య మృతదేహాలు వెలికితీశాయి. సంఘటనా స్థలాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరిషాదేవి వెళ్లి పరిస్థితిని పర్యవేక్షించారు.

ఒకే కుటుంబం... అతలాకుతలం

కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం తూర్పులక్ష్మీపురం గ్రామానికి చెందిన వీరమళ్ల భూషణం, వీరమళ్ల జయబాబు, తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన బేదంపూడి చిన్నగొంతియ్య ముగ్గురూ ఒకే కుటుంబానికి చెందినవారు. ఒకే కుటుంబంలో తండ్రి, కొడుకు, అల్లుడు ఇలా కావడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. వీరమళ్ల భూషణం కుమారుడు జయబాబు. వీళ్లు రోజువారీ కూలి పనులకు వెళ్తుంటారు. వీరివెంట తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామానికి చెందిన బేదంపూడి చిన గొంతియ్య కూడా కొన్నాళ్లుగా పనులకు వెళ్తున్నాడు. అతడు గతంలో తన స్వగ్రామంలో పెయింటింగ్ పనులు చేసేవాడు. ఇటీవల అతడి భార్య భారతిని ప్రసవానికి ఆమె పుట్టింటికి తీసుకెళ్లాడు. అక్కడ అతనికి కొడుకు పుట్టాడు. అక్కడే తన మామ, బావమరిదితో పనులకు వెళ్తున్నాడు. ఈ తరుణంలో శుక్రవారం ఇసుక తీత, లోడింగ్‌కు వెళ్లాడు. అక్కడ అనుకోకుండా జరిగిన ప్రమాదంలో మునిగిపోతున్న వారికి సహాయం చెయ్యబోయి గల్లంతయ్యాడు.

చదువు ఆపేసి.. పనులకు వెళ్తూ..

ఇదే గ్రామానికి చెందిన చింతా గోపి, సత్యవతి దంపతులకు కుమారుడు శ్రీనివాస్(16). అతడికి సోదరుడు దుర్గ, సోదరి భూమిక ఉన్నారు. అతడు ఇటీవలే ఏలేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో చేరి మధ్యలో చదువు ఆపేశాడు. కుటుంబపోషణకు కూలీ పనికి వెళ్తుంటాడు. ఈ నేపథ్యంలోనే భూషణం వెంట శ్రీనివాస్ కూడా వెళ్లి వాగులో గల్లంతు కావడంతో కుటుంబసభ్యుల్లో విషాదం నింపింది.



ట్రాక్టర్‌పై లోడ్ చేసిన ఇసుక

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

» జాయింటు కలెక్టర్ చిన్నరాముడు

» సమిశ్రగూడెం కేంద్రంలో తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జేసీ

నిడదవోలు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతాంగం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింటు కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. సమిశ్రగూడెంలోని రైతు సేవా కేంద్రంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందితో మాట్లాడుతూ రైతుల నుంచి మాత్రమే నేరుగా ధాన్యం కొనుగోలు చేయాలని మధ్యవర్తులు, ఓపెన్ మార్కెట్‌కు అమ్మిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో బ్లాక్ చేసి అవి ప్రభుత్వం కొనుగోలు చేసే ధాన్యంలోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు తక్కువ ధరకు మధ్యవర్తులకు ధాన్యం అమ్ముకుని నష్టపోకుండా ఉండే విధంగా అవగాహన కలిగించాలన్నారు. అనంతరం ఆ దారిలో వెళ్తుండగా రేషన్ పంపిణీ వాహనం వద్ద లబ్ధిదారులతో మాట్లాడి బియ్యం పంపిణీ విధానాన్ని పరిశీలించారు. తహశీల్దార్ బి.నాగరాజు నాయక్, ఎంపీడీవో డి.లక్ష్మీనారాయణ, ఏవో జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాలతో పంటలకు నష్టం

తహశీల్దార్‌కు రైతుల వినతి



పంట బోదెలను పరిశీస్తున్న తహశీల్దార్ ప్రసాద్

ఉండ్రాజవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోళ్లఫారం నుంచి వచ్చే వ్యర్థాల నీరు పంటబోదెల్లోకి వదిలివేయడం వల్ల తమ పంటలు పాడైపోతున్నాయని తాడిపర్రు గ్రామ రైతులు శుక్రవారం తహశీల్దార్ పీఎఎన్‌డీ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఉండ్రాజవరం నుంచి తాడిపర్రు వెళ్లే రోడ్డులో కళారావు, శ్రీనులకు చెందిన కోళ్ల ఫారాలు వల్ల పదేళ్లుగా ఇబ్బందులు పడుతున్నట్టు రైతులు పేర్కొన్నారు. గతంలో తహశీల్దార్‌కు విన్నవించడంతో కొద్దిరోజులు మానివేశారని, మరలా యథావిధిగా వ్యర్థనీరును పంటబోదెల్లోకి వదిలివేస్తున్నారని వాపోయారు. దీనిపై తహశీల్దార్ ప్రసాద్ తన సిబ్బంది, రైతులు, ఫౌల్ట్రీఫారం యజమానులతో కలసి వెళ్లి పంట బోదెలను పరిశీలించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరగా పరిష్కారానికి కృషి చేస్తామని తహశీల్దార్ ప్రసాద్ చెప్పారు.


గోపాలపురం విద్యుత్‌శాఖ

ఏఈగా శ్రీనివాసరావు



గోపాలపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం విద్యుత్ శాఖ ఏఈగా దూసనపూడి శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో నిడదవోలు సబ్‌స్టేషన్‌లో కంస్ట్రక్షన్ ఏఈగా పనిచేసి సాధారణ బదిలీల్లో భాగంగా గోపాలపురం సబ్‌స్టేషన్ ఏఈగా బదిలీపై వచ్చారు. సుమారు రెండేళ్లపాటు ఏఈ పోస్టు ఖాళీగా ఉండటంతో ఇక్కడ ఏడీఏగా పనిచేస్తున్న రవిశంకర్ ఏడీ బాధ్యతలతో పాటు ఏఈగానూ బాధ్యతలు నిర్వహించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రోషిణి



చాగల్లు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) అండ్ 17 విభాగంలో హ్యాండ్‌బాల్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు చాగల్లు హైస్కూల్ విద్యార్థిని రోషిణి ఎంపికైంది. శని, ఆది, సోమవారాలలో విజయవాడలో జరిగే పోటీలలో పాల్గొంటుంది. గత నెలలో ఏలూరులో జరిగిన జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈసందర్భంగా శుక్రవారం హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమలో ప్రధానోపాధ్యాయుడు పి.వీర్రాజు, కోచింగ్ ఇచ్చిన విజయక్ష్మి, విద్యాకమిటీ అధ్యక్షుడు గోపాలకృష్ణ అభినందించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతి

నిడదవోలు, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గత నెల 26న సుమారు 45 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని మహిళ అనారోగ్యంతో చేరింది. అనంతరం మెరుగైన వైద్య సేవల నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఈ నెల 7వ తేదీన గురువారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందిందని దీనిపై డెత్ ఇంటిమేషన్ మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.శోభన్‌కుమార్ తెలిపారు.

మండల సర్వసభ్య సమావేశం

గోపాలపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సుమారు 25మంది అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం పాల్గొన్నారు. దీంతో సమావేశం సదాసీదాగా ముగిసినట్లు అయ్యింది. ఎంపీడీవో బీఎస్ఎస్ శ్రీనివాస్, సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఎంపీటీసీలు, వైస్ఎంపీపీ వెంకటరమణ, పాల్గొన్నారు.



క్రీడా దుస్తులు దరించిన వాలీబాల్ క్రీడాకారులు

ముగిసిన వాలీబాల్ శిక్షణ

కొవ్వూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలలో చక్కటి ప్రతిభ కనబర్చాలని వాలీబాల్ కోచింగ్ క్యాంపు ఇన్‌చార్జి కొయ్యల ప్రసాద్ అన్నారు. శుక్రవారం కొవ్వూరు ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలోని అల్లూరి వెంకటేశ్వరరావు వాలీబాల్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న వాలీబాల్ శిక్షణ శిబిరం ముగిసింది. అవంతీ సంస్థల అధినేత అల్లూరి ఇంద్రకుమార్ సహకారంతో ఈ నెల 4నుంచి 8వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14 రాష్ట్రస్థాయి వాలీబాల్ బాల, బాలికల పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ అందిస్తామన్నారు. క్రీడాకారులకు భోజనం కొడాలి రాజేంద్రప్రసాద్ వసతి లిటరరీ క్లబ్ అందిస్తుందన్నారు. శిక్షణ పొందిన క్రీడాకారులు ఈ నెల 9 నుంచి 11 వరకు విజయనగరం జిల్లా భోగాపురంలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొంటారన్నారు. క్రీడాకారులకు ఉమ్మడి పశ్చిమగోదావరిజిల్లా ఎస్.జి.ఎఫ్ అందించిన క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్.వి.వి.ఎస్.మూర్తి, వి.విజయ్‌కుమార్, కె.రామ్ కుమార్, పి.సత్యనారాయణ, ఆర్.సురేష్, పి. గంగాధర్, వి.గోపాలకృష్ణ, ఎస్.కె.మస్తాన్‌వలీ, ఎస్‌కె ఇస్మాయిల్, నాళం సత్యనారాయణ, ఎస్. హమీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు రెండు రోజులు స్పెషల్ క్యాంపెయిన్



తాళ్లపూడి తహసీల్దార్ రవీంద్రనాథ్

తాళ్లపూడి, నవంబరు 8: ఓటర్లకు రెండు రోజులు స్పెషల్ క్యాంపైన్ డేస్ శని, ఆదివా రాలలో ఆయా పోలింగ్ కేంద్రాలవద్ద నిర్వహిస్తున్నట్లు శుక్రవారం తాళ్లపూడి తహసీల్దార్ బి.రవీంద్రనాథ్ తెలిపారు. తాళ్లపూడి మండలం పరిధిలో 44 పోలింగ్ కేంద్రాలు ఉన్నయని ప్రతి పోలింగ్ కేంద్రంవద్ద ఓటర్లు తమ ఓట్లలో తప్పులను సవరణ చేయించుకోవచ్చని అలాగే 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ నూతన ఓట్లను నమోదు చేయించుకోవచ్చని ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద, బీఎల్‌వోల వద్ద గల నూతన ఓటరు లిస్టులలో తమ ఓటును పరిశీలించుకుని తప్పులు ఉన్నట్లైతే సరిచేసుకోవాల్సిందిగా తహసీల్దార్ తెలిపారు.

సాధారణ ఓట్లు మార్పులు చేర్పులు

నల్లజర్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద శని, ఆదివారం ప్రత్యేక శిబిరం ఏర్పాటుచేసి సాధారణ ఓట్లు మార్పులు చేర్పులు, కొత్త ఓట్ల నమోదు వంటి ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు తహసీల్దార్ పి.కృష్ణారావు తెలిపారు. శుక్రవారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, బీఎల్‌వోలతో సమావేశం ఏర్పాటు ప్రత్యేక శిబిరంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రెండు రోజులపాటు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ కొత్తఓటు నమోదు చేసుకోవాలన్నారు. అదేవిధంగా ఓటరు కార్డులు పేరు మార్పులు, చేర్పులు వంటి సేవలు కొనసాగిస్తారన్నారు

గ్రామ ప్రజల ఆరోగ్యం కాపాడుదాం

● డిప్యూటీ డీఎంహెచ్‌వో సంధ్య

నల్లజర్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజల ఆరోగ్యం కోసం వైద్య సిబ్బంది కష్టపడి పని చేయాలని డిప్యూటీ డిఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ సంధ్య అన్నారు. శుక్రవారం అచ్చన్నపాలెంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యాక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అమె మాట్లాడుతూ గ్రామీణ ప్రజల్లో పౌష్టికాహార లోపాలను గుర్తించి ప్రాథమిక దశలోనే వారికి సరిపడ్డా పౌష్టికాహారం అందిస్తే రోగాలు దరి చేరవన్నారు. కౌమార దశలో ఉన్న బాలికలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తెల్లం గంగాధర్, డాక్టర్ సీరాజుద్దీన్, ఉద్యోగుల సంఘం నాయకులు జీ.వి.వి.ప్రసాద్ పాల్గొన్నారు



అచ్చెన్నపాలెంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సంధ్య

'క్యాన్సర్ లక్షణాలు ఉన్నవారిని గుర్తించాలి'

ఉండ్రాజవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ లక్షణాలతో బాధపడుతున్నవారిని గుర్తించాలని ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ ఆర్ఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో క్యాన్సర్‌పై ఆరోగ్యసిబ్బందికి జరిగిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. ఆరోగ్య సిబ్బంది ఇటువంటి లక్షణాలు కలిగి ఉన్నవారికి స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహించాలని సూచించారు. ఈనెల 14తేదీ నుంచి మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు టెస్టులు చేస్తామని డాక్టర్ ప్రసాద్ చెప్పారు. డాక్టర్ ఆర్. ఉషాదేవి, సీహెచ్‌వో ఎం. సుబ్రహ్మణ్యం, కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లపూడిలో ఉచిత నేత్ర శిబిరం

తాళ్లపూడి, నవంబరు 8: తాళ్లపూడిలో గల శ్రీమతి రాజేశ్వరిరామకృష్ణన్ లైన్స్ కంటి ఆసుపత్రి వారి ఉచిత నేత్ర పరీక్షా కేంద్రం ద్వారా శుక్రవారం 22 మందిని కంటి ఆపరేషన్‌ల నిమిత్తం నిడదవోలు తరలిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి నాగరాజు తెలిపారు. నాగరాజు మాట్లాడుతూ తాళ్లపూడిలో గల కేంద్రంలో నిత్యం ఉచితంగా నేత్ర పరీక్షలు నిర్వహస్తున్నామని ఆరోగ్యశ్రీ కార్డు, తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డులున్న వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తున్నామని తమ సంస్థ వాహనంలో తీసుకువెళ్లి ఆపరేషన్‌ల అనంతరం తిరిగి తీసుకువస్తున్నట్లు తెలిపారు.

పోషన్ వాటికన్ కార్యక్రమం

గోపాలపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోషన్ వాటికన్ కార్యక్రమాన్ని స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోషన్‌వాటికన్ కార్యక్రమంలో ఐసీడీఎస్, ఎన్ఆర్ఈజీఎస్ ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని అనుసంధానం చేసి అంగన్వాడీ పరిసరాల్లో పండించిన ఆకుకూరలను ఆహారపదార్థాల్లో వండిపెట్టడం ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుంది. ఐసీడీఎస్, ఎన్ఆర్జీఎస్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్

గౌరవాధ్యక్షుడిగా రంగా రమేష్ ఎన్నిక



రంగా రమేష్‌ను అభినందిస్తున్న యూనియన్ సభ్యులు

నిడదవోలు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడిగా పట్టణ జనసేన పార్టీ అధ్యక్షుడు రంగా రమేష్‌ను యూనియన్ ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం నిడదవోలు పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద యూనియన్ గౌరవాధ్యక్షుడిగా ఎన్నికైన రంగా రమేష్‌ను ఘనంగా సత్కరించారు. యూనియన్ అధ్యక్షుడు తాడిమళ్ళ శ్రీనివాస్, కార్యదర్శి ఎండీ మొహిద్దీన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ముస్తఫా, ట్రెజరర్ సత్తిబాబు, అదనపు కార్యదర్శి అప్పారావు, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇండియా పోస్టు పేమెంటు బ్యాంకు ఖాతాలు

తెరిచేందుకు ప్రత్యేక శిబిరాలు



తాడేపల్లిగూడెం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంటు కె. కృష్ణ

కొవ్వూరు/గోపాలపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఇండియా పోస్టు పేమెంటు బ్యాంకు (ఐ.పి.పి.బి) ఖాతాలను నవంబరు 15 వరకు తెరిచేందుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తాడేపల్లిగూడెం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.కృష్ణ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న వివిధ పథకాలకు సంబంధించి ప్రభుత్వం అందించే లబ్ధిదారుల ఖాతాలలో నేరుగా అందించడం కోసం తపాలాశాఖ ఐ.పి.పి.బి ఖాతాలను ప్రారంభిస్తుందన్నారు. స్థానిక జిల్లా యంత్రాంగం సహకారంతో గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామన్నా రు. డివిజన్‌లో నిరుపయోగంగా ఉన్న 2.50లక్షల ఖాతాలను పునరుద్ధరించడంతో పాటు కొత్త ఖాతాలను తెరుస్తామన్నారు. డివిజన్ పరిధిలో 229 పోస్టాఫీసుల ద్వారా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని 18 సంవత్సరాలు నిండిన పౌరులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి

నల్లజర్ల, నవంబరు8(ఆంధ్రజ్యోతి): ఫీల్డ్ అసిస్టెంట్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించి వేతనం రూ.26వేలకు పెంచాలని నల్లజర్ల మండల ఉపాధి పథకం ఫీల్డ్‌అసిస్టెంట్స్ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుకు వినతి పత్రం అందించారు. ప్రభుత్వంతో మాట్లాడి తమ సమస్యకు పరిష్కారం చేస్తానని ఎమ్మెల్యే మద్దిపాటి వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాళ్యారి ఆశీర్వాదం,వీరవేణి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మద్దిపాటికి వినతి పత్రం అందిస్తున్న ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్స్